జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
ఖమ్మం
మంగళవారం 17 నవంబర్ 2026 పేజీలు : 8

మధుకాన్ షుగర్ ఫ్యాక్టరీలో
చెరుకు గానుగ ప్రారంభం



6

రైతుల శ్రేయస్సును కాంక్షిస్తూ సుదర్శన హోమం
నష్టాలు వస్తున్నా రైతుల కోసమే కర్మాగారం నిర్వహణ -- మాజీ ఎంపీ నామ
లాభాపేక్ష లేకుండా మధుకాన్ షుగర్ ఫ్యాక్టరీ నిర్వహణ -- మాజీ ఎంపీ నామ
రైతుల సంక్షేమమే మధుకాన్ షుగర్ ఫ్యాక్టరీ ధ్యేయం -- మాజీ ఎంపీ నామ



అభివృద్ధికి, రైతుల సంక్షేమానికి
పెద్దపీట

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల
సత్తుపల్లి వ్యవసాయ మార్కెట్ పాలక వర్గం ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్న మంత్రి

సత్తుపల్లి నవంబర్16(ప్రజా జ్యోతి)

సమగ్ర అభివృద్ధి, ప్రజల, రైతుల సంక్షేమమే ధ్యేయంగా అడుగులు వేస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. మంత్రి సోమవారం సత్తుపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీలో రూ. 10.80 కోట్ల అంచనాతో చేపట్టే వివిధ అభివృద్ధి పనులకు సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ తో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం చల్లగుల్ల నరసింహారావు చైర్మన్ గా సత్తుపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో మంత్రి పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ,?గత 45 సంవత్సరాలుగా ప్రజల కష్టసుఖాల్లో, మంచీచెడుల్లో నిత్యం వెన్నంటి నిలబడి ప్రజలకోసం పనిచేశానని అన్నారు. ఏ రాజకీయ మార్పు వచ్చినా, ఏ పార్టీలో ఉన్నా ప్రజలు, నాయకులు తనను ఎప్పుడూ ఆదరించి ముందుకు నడిపించారని గుర్తుచేసుకున్నారు. ఎన్టీ రామారావు హయాంలో, అన్ని వర్గాలు, ఆరు మండలాలు కలిగిన ఉన్న సత్తుపల్లి నియోజకవర్గంలో తనకు అవకాశం దక్కడం అదృష్టమని తెలిపారు.?ఉమ్మడి రాష్ట్రంలో మొదలైన దేవాదుల, దుమ్ముగూడెం ప్రాజెక్టులు ఆగిపోయినా, తిరిగి సీతారామ ప్రాజెక్టు నియోజకవర్గానికి నీళ్లు తెచ్చామని తెలిపారు. సత్తుపల్లి - మిగతా10లో



జర్నలిస్టుల నోటికాడి ముద్ద లాక్కుంటారా ?

- జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వండి శభాష్ అనిపించుకోండి
- మాజీమంత్రి పువ్వాడ అజయ్ కుమార్
- ముగ్గురు మంత్రుల దృష్టికి తీసుకువెళ్తా
- దిసిసి అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్
- అన్యాయం చేస్తే ఫెన్సింగ్ తొలగించుడే
- బజెపి రాష్ట్ర కోశాధికారి దేవకి వాసుదేవ్ వాసుదేవ్
- కాలనీకి సీఎం శంకుస్థాపన చేయాలి
- తెలంగాణ జర్నలిస్టు ఫోరం జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ
- జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు దక్కేవరకు వారికి అండగా ఉంటాం
- పలు రాజకీయ పార్టీ నేతల భరోసా
- ఖమ్మం కలెక్టరేట్ ఎదుట టి జె ఎఫ్ జర్నలిస్టుల ధర్నా ..కలెక్టర్ కు వినతి

11

ఎవరు చెప్పినా మేము మారం గాక మారం..,
మా స్టైల్ అంతే..

కలెక్టర్, ఎంపీడీవో ఆదేశాలు, బే ఖాతారు,,
సీఎం ప్రజావాణికి కీలక శాఖల అధికారుల డుమ్మా,,
11 దాటిన ఖాళీ కుర్చీలే దర్శనం...
నిర్లక్ష్యపు నీడలో ప్రజావాణి....
అర్జిదారుల ఆగ్రహం...



బాలల సమస్యల
పరిష్కారానికి ప్రత్యేక ప్రజావాణి

జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

బాలల భద్రత, విద్య, ఆరోగ్యం, పోషణ, హక్కులకు ప్రాధాన్యత

చిన్నారుల సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలి



5

ప్రజాదివాస్‌లో బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించిన పోలీస్ కమిషనర్ సునీల్ దత్



ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఖమ్మం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న గ్రీవెన్స్ డే (ప్రజాదివాస్) కార్యక్రమంలో భాగంగా పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పలువురు 25 మంది బాధితుల నుంచి ఫిర్యాదులను స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా భూ వివాదాలు,కుటుంబ, వ్యక్తిగత సమస్యలతో పాటు ఆర్థిక లావాదేవీలు, భార్యభర్తల సమస్యలపై వచ్చిన పలువురు బాధితులు తమ ఫిర్యాదులను పోలీస్ కమిషనర్‌కు అందజేశారు. ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించిన ఆయన,సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చట్టపరిధిలో తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీస్ అధికారులకు సూచించారు.ప్రతి ఫిర్యాదుపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి,బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. కుటుంబ సమస్యలు, ఆర్థిక వివాదాలు, భూ తగాదాల విషయంలో ఫిర్యాదుల స్వభావాన్ని బట్టి చట్టప్రకారం స్పందించాలని, ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని తెలిపారు.ప్రజలకు పోలీస్ శాఖపై నమ్మకం కలిగేలా అధికారులు పనిచేయాలని, ఫిర్యాదుల పరిష్కారంలో పారదర్శకతతో పాటు బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని పోలీస్ కమిషనర్ సూచించారు.

నిరుద్యోగ యువతకు అండగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండీ ఖాదర్ బాబా

పోటీ పరీక్షల అభ్యర్థులకు ప్రత్యేక మోటివేషన్ క్లాస్

59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా వినూత్న కార్యక్రమం





ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి స్థానిక 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండీ ఖాదర్ బాబా ప్రత్యేక చొరవతో,ఆధ్వర్యంలో జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వివిధ ప్రభుత్వ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువత కోసం ప్రత్యేక మోటివేషన్ క్లాస్ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ సైకాలజీ లెక్చరర్ మరియు కాంపిటేటివ్ ఎగ్జామ్స్ నిపుణులు తాళ్లూరి సృజన్ కుమార్ పాల్గొని గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3, గ్రూప్-4, డి ఎస్ సి , ఎస్ ఐ , కానిస్టేబుల్ తదితర ప్రభుత్వ ఉద్యోగ పోటీ పరీక్షలకు సంబంధించిన సిలబస్, పరీక్షా విధానం, ప్రిపరేషన్, ప్రాక్టీస్, ప్రజెంటేషన్ మరియు సమయ నిర్వహణ వంటి అంశాలపై యువతకు విలువైన సూచనలు, దిశానిర్దేశం చేశారు.ప్రముఖ చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ కూరపాటి ప్రదీప్ మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులు చదువుతో పాటు ఆరోగ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు.తగినంత నిద్ర, పౌష్టికాహారం,వ్యాయామం మరియు మానసిక ప్రశాంతత ఎంతో అవసరమని వివరించారు. పరీక్షల ఒత్తిడిని అధిగమించి ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండీ ఖాదర్ బాబా మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు సరైన మార్గదర్శకత్వం, నిపుణుల సూచనలు అందించాలనే లక్ష్యంతో ఇటువంటి ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. యువతకు అవసరమైన పఠన వాతావరణం, గ్రంథాలయ సదుపాయాలను మరింత మెరుగుపరిచేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.నిరుద్యోగ యువత గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుంటూ పట్టుదల, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసంతో ప్రభుత్వ ఉద్యోగాల లక్ష్యాన్ని సాధించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శ్రీమతి పి. పద్మజ, గ్రేడ్-1 లైబ్రేరియన్ శ్రీ సిహెచ్. మాల్సూర్, గ్రేడ్-3 లైబ్రేరియన్లు శ్రీ బాబు, శ్రీ వెంకటేశ్వర్లు, సీనియర్ అసిస్టెంట్ శ్రీ పి. సంతోష్, కార్యాలయ సిబ్బంది మరియు సుమారు 400 మంది నిరుద్యోగ యువత పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలి

ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి



సత్తుపల్లి నవంబర్16(ప్రజా జ్యోతి) పట్టణంలోని స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సత్తుపల్లి శాసన సభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్,రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ గారి ఆధ్వర్యంలో సత్తుపల్లి నియోజకవర్గంలోని సత్తుపల్లి మండల, టౌన్ మరియు వేంసూరు మండల కాంగ్రెస్ పార్టీ కమిటీలను అధికారికంగా సోమవారం ప్రకటించారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లాలోనే తొలిసారిగా సత్తుపల్లి మండల, టౌన్ కాంగ్రెస్ పార్టీ కమిటీలను ప్రకటించడం పట్ల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.సత్తుపల్లి మండల పార్టీ అధ్యక్షులు బిమిరెడ్డి సుబ్బారెడ్డి గారు ప్రతి గ్రామంలో పార్టీ కార్యక్రమాలను సమన్వయం చేస్తూ, గ్రామస్థాయిలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్న తీరును డిసిసి అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్,ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అభినందించారు. అదేవిధంగా సత్తుపల్లి టౌన్ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపుతూ, పట్టణ కమిటీ ఏర్పాటులో కీలకంగా సహకరించిన గాదె చెన్నారావు గారిని నాయకులు అభినందించారు.వేంసూరు మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ, మండలంలోని అన్ని గ్రామాలను సమన్వయం చేసుకుంటూ పార్టీ కమిటీల ఏర్పాటులో చురుకైన పాత్ర పోషిస్తున్న వేంసూరు మండల పార్టీ అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి గారిని కూడా ఎమ్మెల్యే గారు, అధ్యక్షులు అభినందించారు. అలాగే వేంసూరు మండలంలోని అన్ని గ్రామాల అధ్యక్షులు, గ్రామ కమిటీల సభ్యులను అభినందించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ గారు మాట్లాడుతూ,ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి గ్రామంలోని ప్రతి ఒక్కరికీ చేరవేయాల్సిన బాధ్యత కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలందరిపై ఉంది. పార్టీ కోసం ప్రతి ఒక్కరూ సమష్టిగా కష్టపడాలి. రాబోయే రోజుల్లో రాహుల్ గాంధీ ని దేశ ప్రధానమంత్రిగా చేసుకునే లక్ష్యంతో ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలి. గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలి" అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ రిహానా కమల్, మండల, టౌన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, వేంసూరు మండల పార్టీ అధ్యక్షులు, సర్పంచులు, కౌన్సిలర్లు, సభ్యులు, ఎన్ ఎస్ యు ఐ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, కమిటీ సభ్యులు, తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రజా వినతులు, దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి





జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించిన జిల్లా కలెక్టర్

ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి ప్రజల నుంచి స్వీకరించిన వినతులు, దరఖాస్తులను జాప్యం లేకుండా సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస రెడ్డిలతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.ఏదులాపురం మున్సిపాలిటీ ఎస్సీ కాలనీకి చెందిన పి.వెంకన్న తనకు వినికిడి సమస్య ఉందని, సదరం సర్టిఫికెట్ జారీ చేసి వికలాంగుల పెన్షన్ మంజూరు చేయా లని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, డీఆర్డీఓకు పంపిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కైకొండాయిగూడెం గ్రామానికి చెందిన ముస్లిం ప్రతినిధులు తమ గ్రామంలో 40 కుటుంబాలు నివసిస్తున్నాయని, అంత్యక్రియలు నిర్వహించేందుకు స్థలం లేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. గ్రామంలోని సర్వే నంబర్ 223/ఏలో ఉన్న 3 ఎకరాల 3 గుంటల ప్రభుత్వ భూమిలో ఒక ఎకరం కబ్రస్థాన్ కోసం కేటాయించాలని కోరుతూ దరఖాస్తు సమర్పించారు. దీనిపై తహసీల్దార్‌కు పంపిస్తూ క్షేత్రస్థాయిలో పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. చింతకాని మండలం పాతర్లపాడు గ్రామానికి చెందిన ఏ. మునయ్య తనకు ఇందిరమ్మ ఇల్లు కేటాయించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, పీడీ హౌసింగ్‌కు పంపిస్తూ పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముదిగొండ మండలం బాణాపురం గ్రామానికి చెందిన వేముల వెంకటేష్ తన కుమారులకు ప్రైవేట్ పాఠశాలలో ఉచిత విద్య అందేలా ఫీ రీయింబర్స్‌మెంట్ వచ్చేలా చూడాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా విద్యాశాఖ అధికారి, సంక్షేమ శాఖ అధికారులకు పంపిస్తూ పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్.రామమూర్తి, హౌజింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

దళిత జాతిలో మరో ఆణిముత్యం

అడ్వకేట్ గా గుంజ మాధవి..

తల్లిదండ్రుల ఆశయం ఆమె విజయానికి తొలి మెట్టు

పుట్టిన ఊరికి మంచి పేరు తీసుకొస్తా

అడ్వకేటుగా తొలి ప్రాధాన్యం మహిళలకే

గుంజ మాధవిపై ప్రజా జ్యోతి ప్రత్యేక కథనం

ముదిగొండ నవంబర్ 16(ప్రజా జ్యోతి) ముదిగొండ మండలం ముత్తారం గ్రామపంచాయతీ పరిధిలో దళిత జాతిలో పుట్టిన గుంజ మాధవి (31) అడ్వకేట్ గా విజయం సాధించారు.కుటుంబ నేపథ్యం ముత్తారం గ్రామపంచాయతీ పరిధిలో నిరుపేద కుటుంబంలో 03-07-1995 జన్మించిన గుంజ మాధవి(31)తండ్రి గుంజ రాము, తల్లి గుంజ రేణుక, తమ్ముడు నరేంద్ర కుమార్, ఆమెది చిన్న కుటుంబం.తన తండ్రి ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తూ పిల్లలిద్దరిని ఉన్నత చదువులు చదివించడం కోసం అహర్నిశలు శ్రమిస్తూ జీవనం సాగిస్తున్నాడు. తండ్రికి తోడుగా తల్లి రేణుక కూలి పనులు చేస్తూ భర్తకు చేదోడు వాదోడుగా కుటుంబ పోషణలో తన వంతు బాధ్యత వహించేది. తన విద్యాభ్యాసం ముత్తారశీ గ్రామపంచాయతీలో మండల ప్రాథమిక పాఠశాలలో 2001 నుండి 2005 వరకు ప్రాథమిక విద్యాభ్యాసం పూర్తి చేశారు. అనంతరం జిల్లా ప్రాథమిక పాఠశాల ముత్తారం స్కూల్లో 2010 వరకు పదో తరగతి వరకు విద్యాభ్యాసం కొనసాగింది. అనంతరం ముదిగొండ మండల పరిధిలో ఉన్న ముదిగొండ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ నుంచి సెకండ్ ఇయర్ వరకు (బైపిసి) సైన్స్ గ్రూప్ తీసుకొని జూనియర్ కళాశాల విద్యను పూర్తి చేశారు. ఇది మొదలుకొని డిగ్రీ పూర్తి చేసేంతవరకు తన విద్యాభ్యాస ప్రస్థానం కొనసాగింది. కాలక్రమేనా కొంతకాలానికి మాధవికి తల్లిదండ్రులు మ్యారేజ్ చేయడం జరిగింది. గుంజ మాధవి ఒక గృహిణిగా ఆదర్శ ఇల్లాలుగా అత్తింటి వారికి మంచి పేరు తీసుకొచ్చింది. కొన్ని పరిస్థితుల కారణంగా తన దాంపత్య జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు ఎన్నో అవమానాలు,ఎన్నో బాధలు. ఇవన్నీ భరిస్తూ తన కొడుకుకి మంచి జీవితాన్ని ఇవ్వాలని తనకంటూ సమాజంలో ప్రత్యేకమైన స్థానం ఉండాలని, ఆలోచన చేసిన మాధవి తన కష్టాలను కన్నీళ్లను తన విజయానికి తొలిమెట్టుగా మార్చుకున్నారు. వివాహం తర్వాత తన చదువును వదిలేసి కుటుంబం కోసమే బ్రతికారు. కానీ తన జీవితంలో జరిగినటువంటి సంఘటన ఆధారంగా నాకు జరిగిన అన్యాయం తోటి ఆడపిల్లలకు జరగకూడదని దృఢ సంకల్పంతో కంటిలో వస్తున్న కన్నీళ్లను ఆపుతూ గుండెలో ఉన్న బాధను తన పిడికిలిలో బందీ చేస్తూ సీనియర్ అడ్వకేట్ ప్రోత్సాహంతో లా సెట్ రాసి లాయర్ చదువు చదువుకోవటానికి అర్హత సాధించారు. కుటుంబం జీవన సాగించటానికి అమ్మపేట రవీంద్ర భారతి ఇంటర్నేషనల్ స్కూల్లో తెలుగు టీచర్ గా కొంతకాలం తన సేవలు అందించారు. ఇది మొదలుకొని ఇటు తన కన్న కొడుకుని చూసుకుంటూ, తన తల్లిదండ్రులను ఒక కంట కనిపెడుతూ, వాళ్ళ ఆలోచనలకు అనుగుణంగా తన లాయర్ చదువు ప్రారంభించారు. చదువులో ఎన్నో సమస్యలు, ఎన్నో ఆలోచనలు, ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఇవన్నీటిని లెక్కచేయకుండా తల్లిదండ్రుల ప్రోత్సాహంతో తన లాయర్ చదువును పూర్తి చేశారు.11-11-2026 26న





హైదరాబాద్ హైకోర్టు లో నూతన అడ్వకేట్ గా పట్టా పొందారు. తన కూతురు సాధించిన విజయాన్ని ఆస్వాదిస్తూ కంటిలో నుంచి జాలువారుతున్న ఆనంద భాష్పాలతో తన బిడ్డకి తండ్రి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాధవి మాట్లాడుతూ నా జీవితంలో జరిగిన సంఘటనలు ఏ ఆడపిల్ల జీవితంలో జరగకూడదని, అన్ని రంగాలలో ఆడపిల్లలు విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఆడపిల్లలకు ఎన్ని సమస్యలు వచ్చినా తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తండ్రికి ప్రతిజ్ఞ చేశారు.

ఖమ్మం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి రికార్డులు తనిఖీ చేసిన పోలీస్ కమిషనర్ సునీల్ దత్





ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి ఖమ్మం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌ను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సందర్శించి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని రిసెప్షన్ విభాగాన్ని పరిశీలించి, ఫిర్యాదుల స్వీకరణ, నమోదు,పరిష్కారానికి సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, వారి సమస్యలను శ్రద్ధగా విని చట్టప్రకారం తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలని, పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులు, కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కార్యాలయ నిర్వహణలో క్రమశిక్షణ పాటించాలని సూచించారు.అనంతరం పోలీసుల పనితీరును సమీక్షిస్తూ, ప్రతి అధికారి, సిబ్బంది తమకు కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని ఆదేశించారు.ముఖ్యంగా సెక్టార్ అధికారుల బాధ్యతలను వివరిస్తూ, తమ పరిధిలోని ప్రాంతాలపై నిరంతర పర్యవేక్షణ కలిగి ఉండాలని,శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల గుర్తింపు, సమస్యాత్మక ప్రాంతాల పర్యవేక్షణతో పాటు ప్రజలతో నిరంతరం సమన్వయం కొనసాగించాలని సూచించారు.క్షేత్రస్థాయిలో పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేస్తూ ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించాలని పోలీస్ కమిషనర్ ఆదేశించారు. కార్యక్రమంలో ఖమ్మం టౌన్ ఏసీపీ రమణమూర్తి పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన ర్యాలీ

రఘునాథపాలెం



ప్రజా జ్యోతి మండలం వేపకుంట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ ఆదేశాల మేరకు చిల్డ్రన్ రైట్స్ కన్వెన్షన్ వీక్‌లో భాగంగా బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. 'పిల్లలు బడికి.. పెద్దలు పనికి.. ఆడపిల్లలు చదివితేనే ముద్దు.. బాల్య వివాహాలు రద్దు చేయాలి' అనే నినాదాలతో గ్రామంలో ర్యాలీ చేపట్టారు. గ్రామ పెద్దలు, యువతకు బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల హెచ్ఎం గాయత్రి, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం శ్రీకాంత్, ఉపాధ్యాయులు నల్లబోతుల రమాదేవి, సుమలత, మల్లికార్జునరావు, సోమల, జావిద్, వెంకట నరసమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

సిపియస్ రద్దు చేయాలి



ముదిగొండ నవంబర్ 16(ప్రజా జ్యోతి) ప్రభుత్వం సిపియస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, కేంద్ర ప్రభుత్వ మెమో 57 ప్రకారం 2003 డిఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం వర్తింపచేయాలని టియస్ యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదిమూలం వెంకట్ డిమాండ్ చేశారు. ముదిగొండలో జరుగుతున్న టియస్ యుటిఎఫ్ జిల్లా మహాసభలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం కాలయాపన చేయకుండా పిఆర్సీ రిపోర్ట్ తెప్పించుకుని అమలు చేయాలని, పెండింగ్ బిల్లులు చెల్లించుటకు రెండు వేల కోట్ల రూపాయలు ప్రతినెలా విడుదల చేయాలని కోరారు.గురుకల ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు ఇవ్వాలని ,010 పద్దు కింద వేతనాలు చెల్లించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం వివిధ రకాల పేర్లతో పాఠశాలలు స్థాపించడం కాకుండా ఉన్న ప్రభుత్వ పాఠశాలను గరిష్టంగా అభివృద్ధి చేసి, నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందించాలని సూచించారు. 2024 డిఎస్సి ఉపాధ్యా యులకు రెండవ ఇంక్రిమెంట్ మంజూరు చేయాలని కోరారు. సిపిఎస్ ఉపాధ్యాయుల డిఎ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

పిఆర్సి పై కాలయాపన తగదు

ప్రభుత్వం తెలంగాణ రెండవ పిఆర్సీ అమలుపై విపరీతమైన కాలయాపన చేస్తుందని, వెంటనే పిఆర్సి అమలు చేయాలని టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్ష, కార్యదర్శులు దుర్గాభవాని, పారుపల్లి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే పిఆర్సీ ఇవ్వకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఉద్యోగ ,ఉపాధ్యాయ పెన్షనర్లు రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, అసంతృప్తి తొలగాలంటే పిఆర్సీని వెంటనే ప్రకటించడం మినహా ప్రభుత్వము దగ్గర వేరే దారి లేదని తెలియజేశారు. 40 నెలల కాలంగా ఆలస్యమైన పిఆర్సీ గతంలో ఎప్పుడూ లేదని విమర్శించారు. ప్రభుత్వం ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో మీనమేషాలు లెక్కిస్తుందని, ఉద్యోగులు సమాజంలో భాగం అని గ్రహించాలని హితవు పలికారు. ప్రభుత్వం సమస్యల పరిష్కారంలో ఇదే విధమైన కాలయాపన చేస్తే వచ్చే ఎన్నికల్లో ఇబ్బంది ఎదుర్కొంటుందని తెలియజేశారు. ప్రభుత్వం తక్షణమే పిఆర్సీని ప్రకటించడంతోపాటు, సిపిఎస్ రద్దు చేయడం, పెండింగ్ లో ఉన్న ఉద్యోగుల, ఉపాధ్యాయుల, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి నిర్ణీత కాలపట్టిక రూపొందించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల ఏర్పాటు పేరుతో ఉన్న ప్రభుత్వ పాఠశాలలను మూసివేయడం సరికాదని హితవు పలికారు. ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని కోరారు. యాప్ ల భారం తగ్గించి, ఉపాధ్యాయులను బోధనకు పరిమితం చేయాలని కోరారు. సమావేశం కింది తీర్మానాలు చేసింది. జేఏసీ కి ఇచ్చిన హామీ మేరకు వెంటనే పిఆర్సి నివేదిక తెప్పించాలని, సిపిఎస్ విధానం రద్దు చేయాలని, 2003 డిఎస్సి ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం వెంటనే అమలు చేయాలని, అన్ని యాజమాన్యాల ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల షెడ్యూల్ ని విడుదల చేయాలని, సర్వీసు రూల్స్ సమస్యను పరిష్కరించి డైట్ లెక్చరర్లు, ఎంఈఓ, డిప్యూటీఇఓ పదోన్నతులను ఇవ్వాలని, కేజీబీవీ ఉద్యోగ, ఉపాధ్యాయులకు మినిమం టైం స్కేల్ అమలు చేయాలని, గురుకుల ఉపాధ్యాయులకు, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 హెడ్ ద్వారా వేతనాలు చెల్లిస్తూ, హెల్త్ కార్డులు ఇవ్వాలని,ఆశ్రమ పాఠశాలల్లోని పండిట్, పీఈటి పోస్టులు అప్గ్రేడ్ చేసి పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని, నెలకు ?2,000 కోట్ల చొప్పున పెండింగ్ బిల్లులకు విడుదల చేయాలని, పాఠశాలలకు కంప్యూటర్ ఇన్స్ట్రక్టర్లను నియమించాలని, విద్యార్థులకు సరిపడా నోటు పుస్తకాలను, వర్క్ బుక్ లను ,టెస్ట్ పుస్తకాలను అందించాలని తీర్మానించారు.

ఈ మహాసభలో నాయకులు వెంకన్న, షమి, రాంబాబు, రాందాస్,నాగేశ్వరరావు , రామారావు, నర్సయ్య, సురేష్, వలీ, ఉద్దండ్, పద్మ, నిర్మలాకుమారి, విజయ్, ప్రశాంతి, రామకృష్ణ,కోటేశ్వరరావు,సుధాకర్, లివిన్,ఎల్లయ్య, దామోదర్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్‌లో కొదుమూరు విద్యార్థుల విజయకేతనం

ముగ్గురికి జాతీయ స్థాయికి ఎంపిక

మండల క్రీడాకారులను ఘనంగా సన్మానించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సతీమణి భట్టి నందిని



చింతకాని నవంబర్ 16 ప్రజాజ్యోతి : ఖమ్మం జిల్లా తరపున రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ స్టేట్ మీట్‌లో చింతకాని మండలం, జెడ్ పి పి ఎస్ కొదుమూరు పాఠశాలకు చెందిన 8 మంది విద్యార్థులు పాల్గొని అద్భుతమైన క్రీడా ప్రతిభను కనబరిచారు.ఈ పోటీలలో బాలికల విభాగం నుంచి వందనం గ్రామానికి చెందిన సారికా రెడ్డి, బాలుర విభాగం నుంచి రాఘవాపురం కాలనీకి చెందిన గౌరీ శంకర్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.అదేవిధంగా జూనియర్ అండర్-14 విభాగంలో కొదుమూరు గ్రామానికి చెందిన మల్లెబోయిన బిందు జాతీయ స్థాయికి ఎంపికై పాఠశాలకు, గ్రామానికి, మండలానికి గర్వకారణంగా నిలిచారు.ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సతీమణి భట్టి నందిని మండల క్రీడాకారులను ఘనంగా సన్మానించి అభినందించారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి లాసది రామారావు పాల్గొన్నారు. విద్యార్థులకు క్రీడా శిక్షణ అందించి ఈ విజయానికి కృషి చేసిన పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ చల్లమల్ల కృష్ణయ్యని,జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు దునక వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు మరియు పాఠశాల సిబ్బంది అభినందించారు.అలాగే అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ సుగంధరాణి , కొదుమూరు గ్రామ సర్పంచ్ భయ్యా నాగరాణి గారు విద్యార్థులను, పీడీ చల్లమల్ల కృష్ణయ్య గారిని ప్రత్యేకంగా అభినందించి కృతజ్ఞతలు తెలియజేశారు.గ్రామీణ ప్రాంత విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలలో ప్రతిభ చాటి జాతీయ స్థాయికి ఎంపిక కావడం చింతకాని మండలానికి గర్వకారణమని,భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి ఖమ్మం జిల్లాకు,తెలంగాణ రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.

అంగన్వాడీ కేంద్రాల్లో కోడిగుడ్ల కొరత!

15 రోజులుగా నిలిచిన సరఫరా.. టెండర్ల ఆలస్యమే కారణమంటున్న అధికారులు

తిరుమలాయపాలెం, ప్రజా జ్యోతి నవంబర్ 16: మండలం లోని అంగన్వాడీ కేంద్రాల్లో గత 15 రోజులుగా కోడిగుడ్ల సరఫరా నిలిచిపోయింది. దీంతో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందించాల్సిన పోషకాహారంలో అంతరాయం ఏర్పడింది. ప్రభుత్వం నిర్దేశించిన పోషకాహార కార్యక్రమంలో కోడిగుడ్లకు ప్రాధాన్యత ఉన్నప్పటికీ, రెండు వారాలకు పైగా సరఫరా లేకపోవడంపై లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై సంబంధిత క్లస్టర్ సూపర్వైజర్ లక్ష్మి ని వివరణ కోరగా, అంగన్వాడీ కేంద్రాల్లో 15 రోజులుగా కోడిగుడ్లు లేని విషయం వాస్తవమేనని తెలిపారు. కోడిగుడ్ల సరఫరాకు సంబంధించి టెండర్ల ప్రక్రియ ఆలస్యం కావడంతో నిర్ణీత సమయానికి కోడిగుడ్లు అందించలేకపోయామని వివరించారు. అయితే టెండర్ల ప్రక్రియలో జాప్యం కారణంగా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందాల్సిన పోషకాహారంలో అంతరాయం ఏర్పడటంపై ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన



అవసరం ఉంది. వెంటనే సరఫరాను పునరుద్ధరించి, లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బాలల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రజావాణి

ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి బాలల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రజావాణిని సోమవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్లు డా. పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి నిర్వహించారు. ఈ కార్యక్రమంనకు పిల్లలు, వారి తల్లిదండ్రులతో హాజరై జిల్లా కలెక్టర్ కు దరఖాస్తులు సమర్పించారు . కార్యక్రమంలో మొత్తం 19 అప్లికేషన్స్ రాగా, వాటిని పరిష్కారం కొరకు స్పాన్సర్షిప్ కొరకు జిల్లా సంక్షేమ అధికారిణి కి, ఆధార్, పుట్టిన తేదీ సర్టిఫికెట్స్ కొరకు గాను ఈజిల్లా మేనేజర్, అంగ వైకల్య ధృవీకరణల కొరకు గాను డిఆర్డీఏ పిడి కి, ఫీజు రీయంబర్స్మెంట్ కొరకు గాను జిల్లా విద్యాధికారిణికి జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీచేశారు.దరఖాస్తులను సంబంధిత శాఖలు సమన్వయం చేసుకోవాలని వెంటనే పరిష్కరించాలని, పరిష్కార చర్యలపై నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, బాలల భద్రత, విద్య, ఆరోగ్యం, పోషణ, హక్కులకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు.చిన్నారుల సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకోనెలా చర్యలు చేపట్టనున్నట్లు అన్నారు.ఈ



కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిణి ఏ. ప్రమీల, జిల్లా బాలల పరిరక్షణ అధికారిణి టి. విష్ణువందన, కార్మిక అధికారిణి వెంగమాంబ, డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓ డా.లక్ష్మీనారాయణ, సి.సి.ఆర్బి. సి.ఐ. రమేష్, డి.సి.పి.యూ. సిబ్బంది సోనీ, యశోద, శ్రీ లక్ష్మీ, నిరోషా,స్రవంతి,సందీప్,హరిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

న్యూడెమోక్రసీ నేత దుబాకుల ప్రసాద్ మాతృమూర్తికి విప్లవ జోహార్లు

తిరుమలాయపాలెం, ప్రజా జ్యోతి నవంబర్ 16: మండలంలోని బంధంపల్లి గ్రామానికి చెందిన భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్టీయూ) రాష్ట్ర నాయకులు కామ్రేడ్ దుబాకుల ప్రసాద్ మాతృమూర్తి దుబాకుల నాగమ్మ ఆకస్మిక మృతికి సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ మండల కమిటీ నాయకులు నివాళులర్పించారు. నాగమ్మ భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శివర్గ నాయకులు మందుల రాజేంద్రప్రసాద్ ఎర్రజెండాను కప్పి విప్లవ జోహార్లు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కామ్రేడ్ దుబాకుల ప్రసాద్ చిన్నతనంలోనే పేద ప్రజల హక్కుల కోసం పోరాడాలనే ఆలోచనతో విప్లవోద్యమం వైపు ఆకర్షితులై ఉద్యమ బాట పట్టారని పేర్కొన్నారు. అనేక సంవత్సరాల పాటు అజ్ఞాత దళ నాయకుడిగా పనిచేసి, ప్రస్తుతం ఇల్లందు--టేకులపల్లి కేంద్రంగా మైదాన ప్రాంత ఉద్యమంలో చురుకైన పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ప్రజల హక్కుల కోసం తన జీవితాన్ని విప్లవోద్యమానికి అంకితం చేసిన దుబాకుల ప్రసాద్ జీవిత ప్రయాణంలో ఆయన తల్లి నాగమ్మ



ప్రోత్సాహం, సహకారం ఎంతో గొప్పవని పేర్కొన్నారు. అలాంటి మాతృమూర్తిని కోల్పోవడం బాధాకరమని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ తిరుమలాయపాలెం మండల కార్యదర్శి గొర్రెపాటి రమేష్, డివిజన్ నాయకులు గొర్రెపాటి వీరస్వామి, బ్రహ్మచారి, పట్టాభి, దశరథ, లింగన్న, శ్రీను, ఉపేందర్ తదితరులు పాల్గొని నాగమ్మకు నివాళులర్పించారు.

ఇందిరమ్మ జీవిత బీమాను సద్వినియోగం చేసుకోండి...

మధు బాబు



సత్తుపల్లి నవంబర్16(ప్రజా జ్యోతి) తెలంగాణ రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి నిరుపేదల అభివృద్ధి కోసం త్వరలో ప్రవేశపెడుతున్న, ఇందిరమ్మ జీవిత బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని గంగారం గ్రామ విధేయుడు, మాజీ వైస్ ఎంపీపీ దాసరి వెంకటరామిరెడ్డి(చిట్టి నాయన)వారి తనయుడు మధుమోహన్ రెడ్డి (మధుబాబు) పరిసర ప్రాంత ప్రజలందరికీ ఈ అద్భుతమైన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం నుంచి ఈ పథకం అమల్లోకి వస్తుందని, దీని ద్వారా కుటుంబానికి రూ.. 5 లక్షల రూపాయల బీమా వస్తుందని, కుటుంబంలో ఎవరైనా మరణిస్తే ఆ కుటుంబానికి అండగా,చేదోడు, వాదోడుగా,కుటుంబం రోడ్డును పడకుండా దానికి సంబంధించిన ప్రీమియంను ప్రభుత్వ భరిస్తూ,కుటుంబానికి భరోసా ఇస్తుందని అన్నారు. ఈ బీమాకు వర్తించాలంటే రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి ఆమాలు అవుతుందని, భీమా చేపించుకునే వ్యక్తి 18 సంవత్సరాల నుంచి 59 ఏళ్ల మధ్యలో వయసు ఉండాలని, దీనిని నిర్ధారించేందుకు ఆధార్ కార్డు ప్రామాణికంగా తీసుకుంటారని, నమోదు కార్యక్రమంగా గ్రామంలోని ప్రత్యేక శిబిరం పెడతారని, ఊరిలో కూడా దండోరా వేపించి,ప్రతి ఒక్కరికి తెలిసే విధంగా చర్యలు చేపడుతున్నారని వివరించారు. భీమా చేపించుకోవటానికి వెళ్లేటప్పుడు ఆధార్ కార్డు రేషన్ కార్డ్,మొబైల్ నెంబర్,కుటుంబ సభ్యులు వివరాలు వంటివి తీసుకొని భీమా చేపించుకొని ధైర్యంగా ఉండొచ్చు అని తెలియజేశారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని వివరించారు. బీమా చేపించుకునే ముందు నామినేలుగా ఇద్దరు ముగ్గురు వ్యక్తులను పెట్టుకోవచ్చని తెలిపారు.

కుక్కను కట్టేసుకోమన్నందుకు దాడి... మూడు నెలలు జైలు శిక్ష... రూ.5 వేల జరిమానా.

నేలకొండపల్లి, నవంబర్ 16 ప్రజా జ్యోతి: పెంపుడు కుక్క కరవటానికి వస్తుంది...కట్టేసుకోండి అని చెప్పినందుకు దాడి చేశారు... దాడి కేసులో ముద్దాయి కి కోర్టు మూడు నెలలు జైలు శిక్షతో పాటు జరిమానా విధించింది. పోలీసుల కథనం ప్రకారం . వివరాలు ఇలా ఉన్నాయి. నేలకొండపల్లి మండలం లోని కోనాయిగూడెం గ్రామంలో 2019, ఏప్రిల్, 7 వ తేదిన గ్రామానికి చెందిన బోయిన రామారావు అనే వ్యక్తి మోటారు సైకిల్ పై ఇంటికి వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన బిందె వెంకన్న అనే వ్యక్తి ఇంటి వద్దకు వచ్చే సరికి పెంపుడు కుక్క రామారావు ను కరవటానికి వచ్చింది. దీంతో కుక్క ను కట్టేసుకోండి అని వారికి చెప్పటంతో వివాదం జరిగింది.ఈ నేపధ్యంలో రామారావు ను తిట్టి.. దాడి చేశారు. దీంతో బాధితుడు స్థానిక పోలీస్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు పై అప్పటి హెడ్ కానిస్టేబుల్ బీ.కిషన్ కేసు నమోదు చేయగా...ఎస్సై గౌతమ్ దర్యాప్తు చేపట్టారు. ప్రస్తుత ఎస్సై పి.శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో సోమవారం కోర్టులో సాక్షుల విచారణ జరిగింది. విచారణ అనంతరం స్పెషల్ మొబైల్ కోర్టు జ్యుడిషియల్ పస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ నాగలక్ష్మి ముద్దాయి వెంకన్న కు మూడు నెలలు జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. ఈ కేసులో ఏపీపీ కిషన్, కోర్టు డ్యూటీ ఆఫీసర్ గా కానిస్టేబుల్ పి.రవి వ్యవహరించారు.

మధుకాన్ షుగర్ ఫ్యాక్టరీలో చెరుకు గానుగ ప్రారంభం

నేలకొండపల్లి, నవంబర్ 16 ప్రజా జ్యోతి : మండలం రాజేశ్వరపురం గ్రామంలోని మధుకాన్ షుగర్ అండ్ పవర్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ కర్మాగారంలో 2026--27 చెరకు గానుగ సీజన్ సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ఆ సంస్థ వ్యవస్థాపకులు, బీఆర్ఎస్ మాజీ లోక్‌సభా పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు తన సతీమణి చిన్నమ్మతో కలిసి ఉదయం 9.54 గంటలకు చెరకు గడలను గానుగలో వేసి సీజన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కర్మాగారంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, నూతన గానుగ సీజన్ విజయవంతంగా సాగాలని ఆకాంక్షించారు. అనంతరం కర్మాగారం జోన్ పరిధిలోని చెరకు రైతులు, వివిధ రైతు సంఘాల నాయకులతో నామ మాట్లాడుతూ రైతులతో కర్మాగారానికి ఉన్న అనుబంధాన్ని, చెరకు సాగులో వారు ఎదుర్కొంటున్న పరిస్థితులను వివరించారు. ఈ సందర్భంగా నామ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో చక్కెర పరిశ్రమ తీవ్ర గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నదని పేర్కొన్నారు. అనేక ఆర్థిక, నిర్వహణపరమైన సవాళ్లు పరిశ్రమల మనుగడకు ఇబ్బందిగా మారుతున్నాయని వివరించారు. ఇలాంటి పరిస్థితుల్లో రైతులు కర్మాగారానికి సహకరించాలని కోరారు. రైతులు, పరిశ్రమ పరస్పర సహకారంతో ముందుకు సాగినప్పుడే ఇరువర్గాలకు ప్రయోజనం కలుగుతుందని అన్నారు. మధుకాన్ కర్మాగారం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు ఎదుర్కొన్న ఆర్థిక పరిస్థితులను ఈ సందర్భంగా రైతులకు వివరించారు. మొత్తం 26 సంవత్సరాల నిర్వహణలో కోజనరేషన్ విద్యుత్ ఉత్పత్తి విభాగంలో రెండేళ్లు, చక్కెర ఉత్పత్తి



విభాగంలో మరో రెండేళ్లు మాత్రమే లాభాలు వచ్చాయని, మిగిలిన 22 సంవత్సరాలు నష్టాలను ఎదుర్కొంటూనే కర్మాగారాన్ని కొనసాగిస్తున్నామని తెలిపారు. అయినప్పటికీ రైతులకు అండగా నిలవాలనే సంకల్పంతో పరిశ్రమను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ అనేక చక్కెర కర్మాగారాలు నష్టాలను భరించలేక మూతపడిన విషయాన్ని గుర్తుచేశారు. చక్కెర పరిశ్రమల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతున్న తరుణంలో రైతులకు అందుబాటులో ఉండి, వారికి తోడ్పాటు అందించాలనే ఉద్దేశంతో మధుకాన్‌ను కొనసాగిస్తున్నట్లు వివరించారు. తన తండ్రి స్వర్గీయ ముత్తయ్య కూడా రైతేనని, తాను సైతం రైతు కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తినని నామ తెలియజేశారు. రైతుల కష్టాలు, వారి జీవన పరిస్థితులు తనకు తెలుసని, రైతుల కోసం ఏదో ఒకటి చేయాలనే తపనతోనే ఈ కర్మాగారాన్ని నిర్వహిస్తున్నానని చెప్పారు. కర్మాగారాన్ని నిర్వహించడం వెనుక ఎలాంటి లాభాపేక్ష లేదని, రైతులకు మేలు జరగాలనే ప్రధాన ఉద్దేశంతోనే ముందుకు సాగుతున్నామని స్పష్టం చేశారు. చెరకు రైతులకు కర్మాగారంతో ఉన్న అనుబంధం ఎంతో కీలకమని, రైతుల సహకారం, సిబ్బంది అంకితభావం పరిశ్రమ అభివృద్ధికి ఎంతో అవసరమన్నారు. ఈ గానుగ సీజన్‌లో అందరూ సమష్టిగా పనిచేసి విజయవంతం చేయాలన్నారు. గానుగ ప్రారంభోత్సవం తర్వాత నామ దంపతులు చెరకు రైతులతో కలిసి అల్పాహారం స్వీకరించారు. ఈ సందర్భంగా నామ స్వయంగా రైతులకు అల్పాహారం వడ్డించి వారితో ఆత్మీయంగా ముచ్చటించారు. రైతులతో మమేకమై అల్పాహారం స్వీకరించిన నామ వారితో తనకున్న అనుబంధాన్ని చాటుకున్నారు. అనంతరం రైతులు, కర్మాగార సిబ్బంది, వారి కుటుంబ సభ్యుల ఆయురారోగ్యాలు, శ్రేయస్సును కాంక్షిస్తూ ప్రత్యేకంగా సుదర్శన హోమాన్ని నిర్వహించారు. వేద మంత్రోచ్చారణల మధ్య అత్యంత వైభవంగా జరిగిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో పలువురు పాల్గొని పూజలు నిర్వహించారు. హోమం ముగిసిన అనంతరం పూజారులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వచనాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నామ కుటుంబ సభ్యులు, సంస్థ ఏవిపి కోటయ్య, శ్రేయోభిలాషులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, రైతు సంఘాల ప్రతినిధులు, చెరకు రైతులు దండా రంగయ్య చింతనిపు సైదులు యాస విష్ణువర్ధన్ రెడ్డి, సూరపనేని రామకృష్ణ మల్లయ్య యలమద్ది లెనిన్ ర్మాగార అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వివిధ ప్రాజెక్టుల పెండింగ్ భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

ఖమ్మం జిల్లా భూసేకరణ నిర్వహణ వ్యవస్థపై రెవెన్యూ, సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్

ఖమ్మంప్రతినిధి ప్రజా జ్యోతి జిల్లాలో వివిధ ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు.సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస రెడ్డితో కలిసి ఖమ్మం జిల్లా భూసేకరణ నిర్వహణ వ్యవస్థ (ల్యాండ్ యాకక్విసిషన్ మానేజ్మెంట్ సిస్టం) పై సంబంధిత రెవెన్యూ, ఇతర శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులు, ఇతర అభివృద్ధి పనులకు అవసరమైన భూసేకరణను అత్యంత ప్రాధాన్యతగా తీసుకుందని, భూసేకరణకు అవసరమైన నిధులను ప్రభుత్వం క్రమం తప్పకుండా విడుదల చేస్తోందని, జాతీయ రహదారులు, రైల్వే లైన్ల అభివృద్ధి, తదితర ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ వివరాలను మరోసారి క్షుణ్ణంగా పరిశీలించి, అన్ని శాఖల వద్ద ఉన్న వివరాలను సమన్వయం చేయాలని సూచించారు.ముఖ్యంగా సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ అంశంపై ముఖ్యమంత్రి, సంబంధిత మంత్రులు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని తెలిపారు.జాతీయ రహదారుల భూసేకరణ వేగవంతం చేయాలి.ఖమ్మం జిల్లాలో జాతీయ రహదారులకు సంబంధించి రైతులకు పెండింగ్ లో ఉన్న పరిహారం చెల్లింపులను త్వరితగతిన పూర్తి చేయాలని, పెండింగ్‌లో ఉన్న భూసేకరణ ప్రక్రియను కూడా వేగవంతం చేయాలని సూచించారు. క్షేత్ర స్థాయిలో అధికారులు రైతులతో చర్చలు, సంప్రదింపులు ప్రారంభించి పెండింగ్‌లో ఉన్న భూసేకరణ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. భూసేకరణ ప్రక్రియలో ప్రాథమిక సర్వే, ప్రజా ప్రకటన, ఎంజాయ్‌మెంట్ సర్వే, రైతులతో చర్చలు, అవార్డు జారీ,



ఆర్బిట్రేషన్, భూముల స్వాధీనం వంటి ప్రతి దశకు సంబంధించిన వివరాలను ప్రాజెక్టుల వారీగా, భూముల విస్తీర్ణం వారీగా నమోదు చేయాలని తెలిపారు.ముఖ్యమంత్రి డాష్‌బోర్డ్‌లో భూసేకరణకు సంబంధించిన అన్ని వివరాలు అందుబాటు లో ఉన్నాయని, ముఖ్యమంత్రి స్వయంగా ప్రాజెక్టుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. ఈ విషయాన్ని అధికారులు దృష్టిలో ఉంచుకొని భూసేకరణ ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అభివృద్ధి పనులను పూర్తి చేసి వాటి ఫలాలను ప్రజలకు అందించడంలో భూసేకరణ అత్యంత కీలకమని, అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయం తో పనిచేస్తూ నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ సమావేశంలో ఇరిగేషన్ సిఇ వాసంతి, ఎస్ఇ ఎం.వెంకటేశ్వర్లు, ఆర్ అండ్ బి ఎస్ఇ యుగంధర్ రావు, ఖమ్మం ఆర్డీఓ ఎన్. శ్రీనివాస్, పిఆర్ ఇఇ మహేష్ బాబు,తహసీల్దార్లు,ఆర్ అండ్ బి, పంచాయతీ రాజ్,జాతీయ రహదారులు, రైల్వేలు, ఇరిగేషన్, మున్సిపల్ శాఖలకు చెందిన అధికారులు,సంబంధిత శాఖల ప్రతినిధులు,తదితరులు పాల్గొన్నారు.

నవంబర్ 19న కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ఖమ్మం జిల్లా పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ఏర్పాట్లు పూర్తి చేయాలి

కేంద్ర మంత్రి పర్యటన ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్



ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఈ నెల 19న ఖమ్మం జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ,అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డిలతో కలిసి కేంద్రమంత్రి పర్యటన ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు.ఖమ్మం జిల్లా జాతీయ రహదారుల ప్రాజెక్టు డైరెక్టర్ దివ్య కేంద్రమంత్రి పర్యటనకు సంబంధించిన వివరాలను కలెక్టర్‌కు వివరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఈ నెల 19న కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నందున, కేంద్రమంత్రి పర్యటనకు సంబంధించి ఈవెంట్ మేనేజర్ అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ మినిట్ టు మినిట్ ప్రోగ్రాం రూపొందించి, కార్యక్రమాల షెడ్యూల్‌ను ముందుగానే ఖరారు చేయాలని కలెక్టర్ సూచించారు. పర్యటనలో నిర్వహించే ప్రతి కార్యక్రమానికి సంబంధించి స్పష్టమైన ప్రణాళిక రూపొందించాలని, ఆయా శాఖలకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హెలిప్యాడ్, రహదారుల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి:కేంద్ర మంత్రి పర్యటన నేపథ్యంలో హెలిప్యాడ్ ఏర్పాట్లను అవసరమైన ప్రమాణాల ప్రకారం పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ఆర్ అండ్ బి శాఖ అధికారులు పర్యటన మార్గాల్లో రహదారులకు ఇరువైపులా అవసరమైన మరమ్మతులు, ఇతర మౌళిక సదుపాయాల ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు.కేంద్రమంత్రి పర్యటనలో పాల్గొనే వీవీఐపీ లు, వీఐపీలు,సాధారణప్రజలకు వేర్వేరుగా పాసులు జారీ చేయాలని, ప్రవేశ మార్గాలు, కూర్చునే ఏర్పాట్లను ప్రత్యేకంగా ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ సూచించారు. సభా ప్రాంగణంలో ఎలాంటి గందరగోళం లేకుండా వేర్వేరు ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.సభా వేదిక సామర్థ్యానికి అనుగుణంగా వేదికపై ఉండే వారి సంఖ్యను ముందుగానే నిర్ధారించాలని, ప్రసంగించేవారి వివరాలు, ప్రసంగాల క్రమం,యాంకర్ నిర్వహణ తదితర అంశాలను ఖరారు చేయాలని పిడి దివ్య కు సూచించారు.సభకు హాజరయ్యే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సీటింగ్, పార్కింగ్, భద్రత, ఇతర సౌకర్యాలను సమగ్రంగా ఏర్పాటు చేయాలని తెలిపారు.కేంద్ర మంత్రి పర్యటనకు సంబంధించి అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ,కేటాయించిన పనులను నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ సమావేశంలో అదనపు డీసీపీ రామానుజం, ఆర్ అండ్ బి ఎస్ఇ యుగంధర్ రావు,పిఆర్ ఎస్ఇ వెంకట్ రెడ్డి,విద్యుత్ శాఖ ఎస్ఇ ఇనుగుర్తి శ్రీనివాసా చారి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. డి. రామారావు, సంబంధిత శాఖల అధికారులు, జాతీయ రహదారుల శాఖ ప్రతినిధులు,తదితరులు పాల్గొన్నారు.

యువత ఉపాధిని విస్మరించిన కాంగ్రెస్



నేలకొండపల్లి, నవంబర్ 16 ప్రజా జ్యోతి: యువత ఉపాధి కల్పన ను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని బీజెపీ మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ ఆరోపించారు. మండల కేంద్రంలో సోమవారం పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు..కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పధకం హడావుడి చేసి చేతులు దులుపుకున్నారని అన్నారు. యువత కు ప్రత్యేక పధకాలు ప్రవేశపెట్టి...ఎలాంటి రాజకీయ ఒత్తిడి లు లేకుండా నేరుగా అందించాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ ల యువతీ, యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. యువత ను తెలంగాణ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందన్నారు. ఈ సమావేశంలో సూరేపల్లి- జ్ఞానరత్నం, పిట్టల సూరిబాబు, సయ్యద్ మోహినుద్దీన్, బాజా రామకృష్ణ, ఏపూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ వసతి గృహాల విద్యార్థుల జీవితాలతో చెలగాటమా?

నాణ్యత లేని సరుకులకు సెంట్రల్ టెండర్లే కారణం తక్షణమే రద్దు చేయాలి!



ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి స్థానిక ఏజెన్సీలకే సరఫరా బాధ్యతలు అప్పగించాలి తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కూరెళ్ల మహేష్,రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దామాల సత్యం డిమాండ్.తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు సరఫరా చేస్తున్న నిత్యావసర సరుకుల నాణ్యతపై తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. సెంట్రల్ టెండర్ విధానంలో సరఫరా అవుతున్న సరుకుల నాణ్యత,నిల్వల నిర్వహణలో లోపాలు విద్యార్థుల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెడుతున్నాయని తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్ అసోసియేషన్ తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్ అసోసియేషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది.సెంట్రల్ టెండర్ విధానాన్ని తక్షణమే రద్దు చేసి, జిల్లా స్థాయిలో స్థానిక ఏజెన్సీలకు టెండర్లు కేటాయించాలని డిమాండ్ చేసింది. నెలకు అవసరమైన సరుకులను ఒకేసారి కాకుండా విడతల వారీగా సరఫరా చేయాలని, అధికారులు నిరంతరం నాణ్యతను తనిఖీ చేయాలని కోరింది. పేద విద్యార్థుల ఆకలి,ఆరోగ్యంతో ప్రభుత్వం ప్రయోగాలు చేయడం తగదని,నాణ్యత లేని సరుకులు సరఫరా చేసే కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించింది. ఈ సమస్యపై త్వరలోనే రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రిని కలిసి వినతిపత్రం అందజేయనున్నట్లు వ్యవస్థాపక అధ్యక్షులు కూరెల్ల మహేష్ కుమార్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ -- వరంగల్ జోన్ ఇన్‌చార్జ్ దామాల సత్యం సత్యం తెలిపారు.విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించడం ప్రభుత్వ బాధ్యత.. అది వారి హక్కు. సెంట్రల్ టెండర్ విధానాన్ని రద్దు చేసి స్థానిక సరఫరా వ్యవస్థను అమలు చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని విద్యార్థి సంఘాల నాయకులు హెచ్చరించారు.

పాత సబ్‌స్టేషన్ల రూపురేఖలు మారుస్తున్న టీజీఎన్పీడీసీఎల్

తుప్పుపట్టిన పరికరాల మార్పు

కండక్టర్ల సామర్థ్యం పెంపు.. ఏబీ స్విచ్లు, సర్క్యూట్ బ్రేకర్ల ఆధునికీకరణ



ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి విద్యుత్ సరఫరాలో వ్యవస్థ సామర్థ్యం పెంపే లక్ష్యం ఖమ్మం సర్కిల్ పరిధిలో 25 సంవత్సరాలకు పైగా సేవలందిస్తున్న 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లను దశలవారీగా ఆధునికీకరించి,వాటి సామర్థాన్ని మరింత పెంచేందుకు తెలంగాణ ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎన్పీడీసీఎల్) ప్రత్యేక చర్యలు చేపడుతోందని సూపరింటెండింగ్ ఇంజనీర్ ఇనుగుర్తి శ్రీనివాస చారి తెలిపారు. పాత సబ్‌స్టేషన్లలో కాలక్రమేణా అరిగిపోయిన,తుప్పుపట్టిన పరికరాలను గుర్తించి వాటి స్థానంలో నూతన పరికరాలను ఏర్పాటు చేస్తూ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సబ్‌స్టేషన్లను తీర్చిదిద్దుతున్నామని వెల్లడించారు. ఇప్పటివరకు 19చీశ్ంలి సబ్‌స్టేషన్ల ఆధునికీకరణ పనులు పూర్తిచేయగా, మరో 24నంబర్ సబ్‌స్టేషన్లలో పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు.ఈ ఆధునికీకరణ కార్యక్రమంలో భాగంగా తుప్పుపట్టిన స్ట్రక్చరల్ ఛానల్స్ను తొలగించి కొత్తవి ఏర్పాటు చేయడం,పెరుగుతున్న విద్యుత్ లోడ్కు అనుగుణంగా కండక్టర్ల సామర్థ్యాన్ని పెంచడం, పాత ఎయిర్ బ్రేక్ (ఏబీ) స్విచ్ల స్థానంలో నూతన స్విచ్లను అమర్చడం వంటి పనులు చేపడుతున్నట్లు వివరించారు.అదేవిధంగా సర్క్యూట్ బ్రేకర్లకు అవసరమైన కొత్త విడిభాగాలను అమర్చడంతో పాటు బస్బార్లు,ఐసోలేటర్లు, ఇతర కీలక విద్యుత్ పరికరాలను సమగ్రంగా తనిఖీ చేసి,అవసరమైన మరమ్మతులు, మార్పులు చేపడుతున్నామని పేర్కొన్నారు. సబ్‌స్టేషన్ల లోని పవర్ ట్రాన్స్ఫార్మర్ల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ, వాటి నిర్వహణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు.విద్యుత్ పరికరాల్లో తలెత్తే లోపాలను ముందుగానే గుర్తించి సరిదిద్దడం ద్వారా సాంకేతిక సమస్యలను,అనుకోని విద్యుత్ సరఫరా అంతరాయాలను తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు.ముఖ్యంగా వేసవికాలంలో,వ్యవసాయ విద్యుత్ వినియోగం అధికంగా ఉండే సమయాల్లో పెరిగే విద్యుత్ డిమాండ్ను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఈ ఆధునికీకరణ పనులు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. పాత పరికరాల స్థానంలో నూతన పరికరాలను ఏర్పాటు చేయడం వల్ల సబ్‌స్టేషన్ల పనితీరు మెరుగుపడటంతో పాటు విద్యుత్ లోడ్ను సమర్థవంతంగా నిర్వహించే సామర్థ్యం పెరుగుతుందని వివరించారు.విద్యుత్ పంపిణీ వ్యవస్థను మరింత పటిష్టం చేయడం, సబ్‌స్టేషన్ల విశ్వసనీయతను పెంచడం,సాంకేతిక లోపాల వల్ల కలిగే విద్యుత్ అంతరాయాలను తగ్గించడం ద్వారా వినియోగదారులకు నాణ్యమైన,నిరంతర విద్యుత్ సరఫరా అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని సూపరింటెండింగ్ ఇంజనీర్ పేర్కొన్నారు.విద్యుత్ పరికరాల ఆధునికీకరణ పనులన్నింటినీ నిర్దేశిత భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా చేపడుతూ, ప్రాధాన్యత క్రమంలో మిగిలిన పాత సబ్‌స్టేషన్లను కూడా ఆధునికీకరించేందుకు చర్యలు కొనసాగిస్తున్నామని తెలిపారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ బరిలో ఆదార్ పార్టీ అభ్యర్థిగా
బూర సైదారావు
ఖరారు

అభ్యర్థిని ఖరారు చేసిన ఆధార్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ ఈడా శేషగిరిరావు

ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి
తెలంగాణ శాసనమండలి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఆదార్ పార్టీ (అలయన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ పార్టీ) ఎన్నికల బరిలోకి దిగేందుకు సిద్ధమైంది. నల్గొండ ఖమ్మం వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి తమ పార్టీ అభ్యర్థిగా
బూర సైదారావు
ను ఖరారు చేస్తూ ఆధార్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ ఈడా శేషగిరిరావు అధికారిక ప్రకటన విడుదల చేశారు. దీంతో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆదార్ పార్టీ తరఫున
బూర సైదారావు
పోటీ చేయడం ఖరారైంది.ఈ సందర్భంగా తనకు అభ్యర్థిగా అవకాశం కల్పించిన ఆదార్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ ఈడా శేషగిరిరావుకు బూర సైదారావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.తనపై నమ్మకం ఉంచి మూడు ఉమ్మడి జిల్లాల పరిధిలోని పట్టభద్రుల నియోజకవర్గానికి అభ్యర్థిగా ఎంపిక చేయడం తనకు ఎంతో సంతోషాన్ని,బాధ్యతను కలిగించిందని పేర్కొన్నారు. పార్టీ నాయకత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, పార్టీ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు.పట్టభద్రులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రధానంగా ప్రస్తావిస్తూ ఎన్నికల ప్రచారాన్ని ముందుకు తీసుకెళ్తానని
బూర సైదారావు
పేర్కొన్నారు. ముఖ్యంగా నిరుద్యోగ పట్టభద్రులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియను వేగవంతం చేయడం,విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారం,యువతకు ఉపాధి అవకాశాలు, ప్రైవేటు మరియు ప్రభుత్వ రంగ ఉద్యోగుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు. పట్టభద్రుల ఆశయాలు,ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తూ వారి సమస్యలను శాసనమండలిలో బలంగా వినిపించడమే తన ప్రధాన లక్ష్యమని వెల్లడించారు.నల్గొండ,ఖమ్మం,వరంగల్ ఉమ్మడి జిల్లాల పరిధిలోని పట్టభద్రులను ప్రత్యక్షంగా కలుసుకుని అభిప్రాయాలను తెలుసుకుంటానని, ప్రతి ఒక్కరి సమస్యను అర్థం చేసుకుంటూ ఎన్నికల ప్రచారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తానని తెలిపారు. ఆదార్ పార్టీ సిద్ధాంతాలు, విధానాలను పట్టభద్రులకు వివరించి మద్దతు కూడగట్టేందుకు కృషి చేస్తానని చెప్పారు.తన అభ్యర్థిత్వానికి సహకరిస్తున్న పార్టీ రాష్ట్రస్థాయి నాయకులకు, జిల్లా నాయకులకు, పార్టీ శ్రేణులకు,అభిమానులకు
బూర సైదారావు
ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పార్టీ నాయకులు,కార్యకర్తలు సమష్టిగా పనిచేసి తన విజయానికి సహకరించాలని కోరారు.మరోవైపు ఇప్పటికే ప్రధాన రాజకీయ పార్టీలు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై దృష్టి సారిస్తున్న నేపథ్యంలో ఆదార్ పార్టీ అభ్యర్థిగా బూర సైదారావు బరిలోకి దిగడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.మూడు ఉమ్మడి జిల్లాల పరిధిలో పట్టభద్రుల మద్దతు కూడగట్టుకుని ఎన్నికల్లో తనదైన ముద్ర వేయాలని ఆదార్ పార్టీ లక్ష్యంగా పెట్టుకుంది. ఆ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ ఈడా శేషగిరిరావు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ పట్టభద్రుల ఆదరణతో విజయం సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగుతానని పట్టభద్రుల ఎమ్మెల్సీ బరిలో ఆదార్ పార్టీ అభ్యర్థిగా బూర సైదారావు ఖరారు!

ఇరుముడి తో 75 మంది భక్తులు శబరిమల పయనం...!

స్వామియే శరణం అయ్యప్ప.






నేలకొండపల్లి, నవంబర్ 16 ప్రజా జ్యోతి: మండలం లోని మంగాపురంతండా గ్రామానికి చెందిన అయ్యప్ప మాలధారణ భక్తుల ఇరుమడి కార్యక్రమం సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన 75 మంది స్వాములు 41 రోజులు పాటు అత్యంత భక్తి శ్రద్ధలతో దీక్షను చేపట్టారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురుస్వామి వెంకటేశ్వర్లు, ఆధ్వర్యంలో ఇరుముడి కార్యక్రమంను నిర్వహించారు. స్వామియే శరణం అయ్యప్ప అంటూ...శరణఘోష తో గ్రామం మారుమోగింది. అనంతరం ప్రత్యేక బస్సుల ద్వారా శబరిమల పయనమయ్యారు. ఈ కార్యక్రమంలో మాలధారణ భక్తులు భూక్యా వెంకటేశ్వర్లు, కోట్యా, వెంకటేశ్వర్లు. వెంకన్న, కృష్ణ రామకృష్ణ , రామదాసు తదితరులు పాల్గొన్నారు.

వెంకట్రామరావు సేవలు మరవలేనివి

జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ కొర్లకుంట్ల నాగేశ్వరరావు.



నేలకొండపల్లి, నవంబర్ 16 ప్రజా జ్యోతి: పశు సంవర్ధక శాఖ మాజీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ రావెళ్ల వెంకట్రామరావు సేవలు మరవలేనివి అని జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ కొర్లకుంట్ల నాగేశ్వరరావు పేర్కొన్నారు. మండలం లోని కొత్తకొత్తూరు గ్రామానికి చెందిన వెంకట్రామరావు సోమవారం మృతి చెందారు. మృతదేహం ను ఖమ్మం లోని ఓ మెడికల్ కాలేజీ కి దానం చేశారు. మృతదేహం ను సందర్శించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.. పశు సంవర్ధక శాఖ లో ఏడీ గా పని చేసి పదవీ విరమణ పొందారన్నారు. అయినప్పటికీ జిల్లా పశు గణాభివృద్ధి లో సీబీఓ ఆధికారిగా పదేళ్ల పాటు సేవలు అందించారని" అన్నారు. ఆయన పశు సంవర్ధక శాఖలో రైతులకు ఎనలేని సేవలు అందించారన్నారు. ఆయన మృతి పట్ల సంతాపం ను వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు ప్రగాడ సానుభూతిని తెలియజేశారు. సంతాపం తెలిపిన వారిలో నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, సర్పంచ్ కళావతి, ఉప సర్పంచ్ వల్లాల రాధాకృష్ణ, గోపాలమిత్ర లు బోయపాటి నారాయణ, ఆంజనేయులు.. తాజ్పాషా, పాండురంగయ్య తదితరులు సంతాపం ను ప్రకటించారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో ఇంటి సామాన్లు దగ్ధం



బోనకల్, నవంబర్ 16 (ప్రజా జ్యోతి): మండల పరిధిలోని చిరునోముల గ్రామానికి చెందిన ఆశా కార్యకర్త నిమ్మతోట గీత ఇంట్లో సోమవారం మధ్యాహ్నం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఫ్రిజ్, ఫ్యాన్లు, బియ్యం తదితర గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. సుమారు రూ.50 వేల నష్టం వాటిల్లినట్లు బాధితురాలు తెలి పారు. ఘటనా స్థలాన్ని గిర్దావర్-1 సామినేని నరసింహా రావు, ఏఎంసీ డైరెక్టర్ అనుమోలు వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి మొగిలి శివశంకర్, వీఏఓ గొట్టేముక్కల కృష్ణమూర్తి పరిశీలిం చారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆర్థిక సాయం అందించేం దుకు కృషి చేస్తామని సామినేని నరసింహారావు బాధితురాలికి హామీ ఇచ్చారు. ఇళ్లలో షార్ట్‌సర్క్యూట్ జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఇతర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు విద్యుత్ మీటర్‌ను నిలిపివేయాలని సూచించారు.

అక్రమ ఇసుక రవాణాకు పోలీసుల చెక్

మూడు ప్రాంతాల్లో ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు


బోనకల్ ఎస్సై మాచినేని రవి

బోనకల్, నవంబర్ 16 (ప్రజా జ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి తెలంగాణలోకి రాత్రి వేళల్లో అక్రమంగా ఇసుక రవాణా జరగకుండా బోనకల్ పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు మండల పరిధిలోని మోటమర్రి, గోవిందాపురం (ఏ), బోనకల్ గ్రామాల వద్ద ప్రత్యేక చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. ఈ చెక్‌పోస్టుల వద్ద బోనకల్ పోలీస్ సిబ్బంది రాత్రి వేళల్లో నిరంతరం వాహనాల తనిఖీలు చేపడుతూ అక్రమ ఇసుక రవాణాపై నిఘా కొనసాగిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణలోకి అనుమతులు లేకుండా ఇసుక తరలించే వాహనాలను గుర్తించేందుకు ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నారు. అక్రమ ఇసుక రవాణాకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని బోనకల్ ఎస్ఐ మాచినేని రవి హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి ఇసుక రవాణా చేస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు పోలీసుల ప్రత్యేక నిఘా కొనసాగుతుండటంతో ఇసుక అక్రమ రవాణాదారుల్లో అప్రమత్తత నెలకొంది. పోలీసు వారి నిబంధనలో అతిక్రమించి ఎవరైనా అక్రమంగా ఇసుక రవాణా కు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని బోనకల్ ఎస్సై మాచినేని రవి తెలిపారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ బరిలో ఆదార్ పార్టీ అభ్యర్థిగా బూర సైదారావు ఖరారు

అభ్యర్థిని ఖరారు చేసిన ఆధార్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ ఈడా శేషగిరిరావు

ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి తెలంగాణ శాసనమండలి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఆదార్ పార్టీ (అలయన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ పార్టీ) ఎన్నికల బరిలోకి దిగేందుకు సిద్ధమైంది. నల్గొండ ఖమ్మం వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి తమ పార్టీ అభ్యర్థిగా బూర సైదారావును ఖరారు చేస్తూ ఆధార్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ ఈడా శేషగిరిరావు అధికారిక ప్రకటన విడుదల చేశారు. దీంతో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆదార్ పార్టీ తరఫున బూర సైదారావు పోటీ చేయడం ఖరారైంది.ఈ సందర్భంగా తనకు అభ్యర్థిగా అవకాశం కల్పించిన ఆదార్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ ఈడా శేషగిరిరావుకు బూర సైదారావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.తనపై నమ్మకం ఉంచి మూడు ఉమ్మడి జిల్లాల పరిధిలోని పట్టభద్రుల నియోజకవర్గానికి అభ్యర్థిగా ఎంపిక చేయడం తనకు ఎంతో సంతోషాన్ని,బాధ్యతను కలిగించిందని పేర్కొన్నారు. పార్టీ నాయకత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, పార్టీ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు.పట్టభద్రులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రధానంగా ప్రస్తావిస్తూ ఎన్నికల ప్రచారాన్ని ముందుకు తీసుకెళ్తానని బూర సైదారావు పేర్కొన్నారు. ముఖ్యంగా నిరుద్యోగ పట్టభద్రులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియను వేగవంతం చేయడం,విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారం,యువతకు ఉపాధి అవకాశాలు, ప్రైవేటు మరియు ప్రభుత్వ రంగ ఉద్యోగుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు. పట్టభద్రుల ఆశయాలు,ఆకాంక్షలకు అనుగు ణంగా పనిచేస్తూ వారి సమస్యలను శాసనమండలిలో బలంగా వినిపించడమే తన ప్రధాన లక్ష్యమని వెల్లడించారు. నల్గొండ,ఖమ్మం,వరంగల్ ఉమ్మడి జిల్లాల పరిధిలోని పట్టభద్రులను ప్రత్యక్షంగా కలుసుకుని అభిప్రాయాలను తెలుసుకుంటానని, ప్రతి ఒక్కరి సమస్యను అర్థం చేసుకుంటూ ఎన్నికల ప్రచారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తానని తెలిపారు. ఆదార్ పార్టీ సిద్ధాంతాలు, విధానాలను



పట్టభద్రులకు వివరించి మద్దతు కూడగట్టేందుకు కృషి చేస్తానని చెప్పారు.తన అభ్యర్థిత్వానికి సహకరిస్తున్న పార్టీ రాష్ట్రస్థాయి నాయకులకు, జిల్లా నాయకులకు, పార్టీ శ్రేణులకు,అభిమానులకు బూర సైదారావు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పార్టీ నాయకులు,కార్యకర్తలు సమష్టిగా పనిచేసి తన విజయానికి సహకరించాలని కోరారు.మరోవైపు ఇప్పటికే ప్రధాన రాజకీయ పార్టీలు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై దృష్టి సారిస్తున్న నేపథ్యంలో ఆదార్ పార్టీ అభ్యర్థిగా బూర సైదారావు బరిలోకి దిగడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. మూడు ఉమ్మడి జిల్లాల పరిధిలో పట్టభద్రుల మద్దతు కూడగట్టుకుని ఎన్నికల్లో తనదైన ముద్ర వేయాలని ఆదార్ పార్టీ లక్ష్యంగా పెట్టుకుంది. ఆ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ ఈడా శేషగిరిరావు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ పట్టభద్రుల ఆదరణతో విజయం సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగుతానని పట్టభద్రుల ఎమ్మెల్సీ బరిలో ఆదార్ పార్టీ అభ్యర్థిగా బూర సైదారావు ఖరారు!

హరిహర భేదం లేని పూజ కార్తీక మాసంలో శివుడిని విష్ణువుని

ఇద్దరిని సమానంగా పూజిస్తారు. అర్చకులు నరసింహమూర్తి.

ఎర్రుపాలెం ప్రజా జ్యోతి మండల పరిధిలోని బనిగండ్లపాడు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. కార్తీక సోమవారం కావటంతో ఆలయ అర్చకులు కాశవఝుల నరసింహమూర్తి స్వామివారికి తెల్లవారుజామున నుండి రుద్రాభిషేకాలు, బిల్వార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మాట్లాడుతూ హరిహర భేదం లేని పూజ ఈ కార్తీక మాసంలో శివుడిని, విష్ణువు ను ఇద్దరినీ సమానంగా పూజిస్తారని, విష్ణువు తులసిలో, శివుడు మారేడు(బిల్వ) వృక్షంలో నివసిస్తారని అన్నారు. సోమవారలు శివునికి అత్యంత ప్రీతికరమైన రోజులు అని, తెల్లవారుజామున నది స్నానాలు, కార్తీక పురాణ పఠనం, ఏకభుక్తం లేదా ఉపవాసాలు



చేయడం వల్ల ఆ స్వామివారి ఆశీస్సులు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

అభివృద్ధికి, రైతుల సంక్షేమానికి పెద్దపీట





-మొదటిపేజీ తరువాయి

నియోజకవర్గంలోని చెరువు ద్వారా ఇప్పటికే భూములకు నీరు అందించామని, రాబోయే సంక్రాంతి పండగ నాటికి వేశ్యాకాంతల చెరువుకు కూడా గోదావరి జలాలు అందిస్తామని స్పష్టం చేశారు. ఢిల్లీలో ఎన్జీటీ సమస్యలు పూర్తి చేసుకుని, మే నెలకల్లా మరిన్ని ప్రాంతాలకు గోదావరి జలాలు అందించేలా సీఎం రేవంత్ రెడ్డితో మాట్లాడి నిధులు మంజూరు చేయిస్తామని అన్నారు. ?కల్లూరుగూడెం ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ నిర్మాణంతో, ఈ ప్రాంతంలో 3 వేల ఎకరాలలో పామాయిల్ ప్లాంటేషన్ జరిగిందని, మరో 3 వేల ఎకరాలకు కూడా రైతులు ముందుకు వస్తున్నారని తెలిపారు. పామాయిల్ రైతులు నష్టపోకుండా శాశ్వత ప్రయోజనం చేకూరుస్తామని చెప్పారు. పామాయిల్ తో పాటు కోకో, మిరియాలు వంటి ఉద్యానవన పంటలను సాగు చేసి రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని అన్నారు .?ఒక విమానాశ్రయం, భద్రాద్రి రాముడికి రైల్వే లైన్, అలాగే సత్తుపల్లి మీదుగా కోవూరు, కొండపల్లికి రోడ్లు రవాణా సౌకర్యాలు మెరుగుపరచడమే తన లక్ష్యమని మంత్రి తెలిపారు. ఖమ్మం మార్కెట్ మాదిరిగా సత్తుపల్లి మార్కెట్ ని కూడా మోడల్ మార్కెట్ గా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ, పార్టీ విజయం కోసం కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరినీ సముచిత రీతిలో గౌరవించుకోవడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని, అందులో భాగంగానే సత్తుపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా చల్లగుల్ల నరసింహారావుకు బాధ్యతలు అప్పగించడం జరిగిందని అన్నారు. రాబోయే రెండేళ్ల కాలంలో నూతన పాలకవర్గం మార్కెట్‌ను మరింత అభివృద్ధి చేసి రైతులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతే రాజు అనే నినాదంతో ఆరు గ్యారెంటీలతో పాటు హామీ ఇవ్వని ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. ఉచిత బస్సు, గృహజ్యోతి ఉచిత కరెంటు, కొత్త రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ, రైతు రుణమాఫీ, వరి ధాన్యానికి బోనస్ వంటి చారిత్రాత్మక పథకాలు దేశంలో మరెక్కడా లేని విధంగా మన రాష్ట్రంలోనే అమలవుతున్నాయని అన్నారు. ప్రతి నియోజకవర్గానికి రూ. 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను మంజూరు చేశామన్నారు.

నవంబర్ 19 నుంచి కొత్త పెన్షన్ల పంపిణీ ప్రారంభమవుతోందని, రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల మందికి, సత్తుపల్లి నియోజకవర్గంలో 4,700 మందికి ఒంటరి మహిళ, వితంతు, వికలాంగ, కల్లుగీత, చేనేత కార్మిక పెన్షన్లు మంజూరయ్యాయని తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా మొదటి విడతలో 3,500 ఇళ్లు ఇచ్చామని, రెండో విడతలో మరో 2,000 ఇళ్లు మంజూరు చేస్తున్నామని, మూడు, నాలుగు విడతల్లో అర్హులందరికీ ఇళ్లు అందుతాయని ఎమ్మెల్యే అన్నారు.

ప్రభుత్వం ఇన్ని సంక్షేమ కార్యక్రమాలు చేస్తున్నప్పటికీ వాటిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాల్సిన బాధ్యత నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. ప్రతిపక్షాల విమర్శలను దీటుగా తిప్పికొడుతూ, మనం చేసిన అభివృద్ధిని గర్వంగా చెప్పుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామ, మండల, పట్టణ స్థాయి కమిటీలతో పార్టీని మరింత బలోపేతం చేసుకోవాలని సూచించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా, సత్తుపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు బలమైన ఓటు బ్యాంకు ఉందని, ఐకమత్యంతో పనిచేస్తే రాబోయే ఎన్నికల్లోనూ విజయం మనదేనని ధీమా వ్యక్తం చేశారు.

రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు, రానున్న అసెంబ్లీ ఎన్నికలకు రెఫరెండం లాంటివని, గతంలో తీన్మార్ మల్లన్నను గెలిపించిన తరహాలోనే ఇప్పుడు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి సర్వోత్తమ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే అన్నారు. తద్వారా నిరుద్యోగులు, ఉద్యోగస్తుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం సహకరిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ, సత్తుపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో నంబర్ వన్‌గా నిలపాలని అన్నారు. ?ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ రాహుల్ రాజ్, ఉప సంచాలకులు వి. పద్మావతి, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఆర్. సంతోష్ కుమార్, సత్తుపల్లి మునిసిపల్ చైర్ పర్సన్ రెహానా కమల్ , దోమ ఆనంద్ బాబు, మండల పార్టీ అధ్యక్షులు భీమిరెడ్డి సుబ్బారెడ్డి,గొర్ల మారి రామ్మోహన్ రెడ్డి, గాదె చెన్నారావు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణ లక్ష్మి చెక్కును పంపిణీ చేసిన తలుపుల వెంకటేశ్వర్లు

మధిర ప్రజా జ్యోతి స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ఒక కార్యక్రమంలో పట్టణానికి చెందిన పసుమర్తి రజిని కి కళ్యాణ లక్ష్మి పథకం చెక్కును మధిర పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తలుపుల వెంకటేశ్వర్లు అందజేశారు.


ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కళ్యాణ లక్ష్మి పథకం ఎంతో మంది నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మోదుగు బాబు, గద్దల రాజా, లింగంపల్లి అప్పారావు, రవి తదితరులు పాల్గొన్నారు.



మున్నూరుకాపు సంఘం

అభివృద్ధికి కృషి చేస్తా

వెనుకబడిన కుటుంబాలను ముందుకు తీసుకెళ్లడమే నా ధ్యేయం: సచ్చు రామారావు



రఘునాథపాలెం: ప్రజా జ్యోతి చిమ్మపూడి గ్రామ మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన సచ్చు రామారావు సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. మున్నూరుకాపు సంఘాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు కులంలోని వెనుకబడిన కుటుంబాలను గుర్తించి వారికి అండగా నిలుస్తానని పేర్కొన్నారు. విద్య, ఉపాధి, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తానన్నారు. సంఘ సభ్యులందరినీ ఐక్యంగా కలుపుకొని సామాజిక అభివృద్ధికి కృషి చేయడమే తన ప్రధాన లక్ష్యమని సచ్చు రామారావు వెల్లడించారు.

ఈవో భవన నిర్మాణ స్థలం మార్చాలని ప్రజల వినతి

ప్రజావాణిలో ప్రజల ఫిర్యాదు, బండిపాడుకు బదులుగా కొండాయిగూడెం రెవెన్యూ ప్రభుత్వ స్థలం కేటాయించాలని ప్రజల విజ్ఞప్తి,



కామేపల్లి ప్రజా జ్యోతి నవంబర్ 16

కామేపల్లి మండలంలోని రుక్కి తండా గ్రామపంచాయతీ పరిధిలోని మహిళా సమైక్య నిర్మాణ స్థలాన్ని మార్చాలని కోరుతూ బండిపాడు రాయగూడెం గ్రామ ప్రజలు కామేపల్లి ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో అధికారులకు వినతి పత్రం అందజేశారు.

మహిళా సమైక్య భవన నిర్మాణ నిమిత్తం గతంలో బండిపాడు హ్యాబిటేషన్ లోని కూలిపోయే స్థితిలో ఉన్న అంగన్వాడి 1 స్థలాన్ని ఎంపిక చేసి జిల్లా కలెక్టర్ ప్రతిపాదనలు పంపడం జరిగిందని వారు పేర్కొన్నారు అయితే ఈ ప్రతిపాదనను పరిశీలించి మంజూరి చేయకపోవడం వలన రాయగూడెం హెబిటేషన్లో ఉన్న తిరుపతమ్మ తల్లి గుడి పక్కన కొండాయిగూడెం చెరువు సికం స్థలాన్ని కి పక్కనే కేటాయించాలని గ్రామస్తులు కోరారు.

స్థానిక అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వ భూమిని కేటాయించి భవన నిర్మాణం చేపట్టాలని వారు అధికారులను అభ్యర్థించారు.

జర్నలిస్టుల నోటికాడి ముద్ద లాక్కుంటారా ?









ఖమ్మం ప్రతినిధి: (ప్రజా జ్యోతి) నవంబర్: 16 జర్నలిస్టుల నోటికాడి ముద్దను లాక్కుంటారా? వారివి గొంతెమ్మ కోరికలు కావు. గత కెసిఆర్ ప్రభుత్వంలో ఖమ్మం జర్నలిస్టులకు 23.2 ఎకరాల స్థలాన్ని హౌసింగ్ సొసైటీకి కేటాయిస్తూ క్యాబినెట్ ఆమోదం పొందింది. వాటిని అమలు చేయాల్సిన బాధ్యత ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులపై ఉందని బి ఆర్ ఎస్ మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టీజేఎఫ్) ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఖమ్మం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. జర్నలిస్టులు చేపట్టిన ధర్నా కార్యక్రమానికి కాంగ్రెస్, బి ఆర్ ఎస్, బిజెపి, సిపిఐ, సిపిఎం, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ, మాస్ లైన్, జనసేన పార్టీ,కవిత టిఆర్ఎస్ పార్టీ, ఆధార్ పార్టీ తోపాటు విద్యార్థి, యువజన, కుల సంఘాల నేతలు తరలివచ్చి జర్నలిస్టులు చేపట్టిన ధర్నాలో పాల్గొని తమ సంపూర్ణ మద్దతును తెలియజేసి ప్రసంగించారు. ఈ సందర్భంగా బి ఆర్ ఎస్ మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ మాట్లాడుతూ... ఖమ్మం జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఆనాడు కెసిఆర్ స్వయంగా ఖమ్మం సభలో ప్రకటించి ఇచ్చిన మాట ప్రకారం క్యాబినెట్లో ఆమోదం పొంది జీవో 147ను విడుదల చేసి 23.2 ఎకరాల ఎన్ఎస్పి స్థలాన్ని కేటాయించడం జరిగిందని అన్నారు. దురదృష్టవశాత్తు ఎన్నికల రావటంతో అప్రక్రియ నిలిచిపోయిందని అన్నారు. ఆ ఎన్నికల్లో తిరిగి బి ఆర్ ఎస్ గెలిచి ఉంటే ఈపాటికి జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు వచ్చేవని వివరించారు. ఒక్క కన్నుతో ఖమ్మం జిల్లాలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి జర్నలిస్టులకు జీవో తీసుకువచ్చానని, కానీ ముగ్గురు మంత్రులు ఖమ్మంలో ఉండి ఆరు కండ్లతో జర్నలిస్ట్ కాలనీ ఎందుకు నిర్మించలేకపోయారో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. రాజకీయాలు ముఖ్యం కావని జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చి శభాష్ అనిపించుకోవాలని సూచించారు.

ముగ్గురు మంత్రుల దృష్టికి తీసుకు వెళ్తా
డిసిసి అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్

ఈ సందర్భంగా డిసిసి అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ... జర్నలిస్టులు చేస్తున్న పోరాటం న్యాయబద్ధమైనదని, ఎంతోకాలంగా సమస్య పరిష్కారం కావడం లేదని, వారి సమస్య పరిష్కారం కోసం ఖమ్మం జిల్లాలోని ముగ్గురు మంత్రుల దృష్టికి తీసుకువెళ్లి త్వరలోనే ఆ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. త్వరలో ముఖ్యమంత్రి ఖమ్మం జిల్లా పర్యటనకు వస్తున్నారని, ముఖ్యమంత్రి చేత తీపి కబురు అదే విధంగా తన వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు.

జర్నలిస్టులది న్యాయబద్ధమైన డిమాండ్

ఖమ్మం అర్బన్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి జర్నలిస్టులది న్యాయబద్ధమైన డిమాండ్ అని, ఎన్నో ఏండ్లుగా వారు పోరాటం చేస్తున్నారని ఆ సమస్య పరిష్కారానికి పరిష్కారం చూపించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కాలయాపన చేయటం వల్ల మంచిది కాదన్నారు. మంత్రి తుమ్మల తన ఇంటి వద్దకు వచ్చిన సందర్భంలో జర్నలిస్టులతో చర్చించటం జరిగిందని గుర్తు చేశారు. జర్నలిస్టులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

పెన్సింగ్ తొలగించుడే:బిజెపి నేతలు

జర్నలిస్టులకు కేటాయించిన స్థలానికి కొంతమంది ముళ్ళ కంచ వేయించారని, జర్నలిస్టులకు దక్కాల్సిన ఇళ్ల స్థలాలు సీఎం పర్యటన వచ్చేనాటికి ప్రకటన వెల్లువడక పోతే వేసిన ఫెన్సింగ్ తొలగించుడేనని బిజెపి రాష్ట్ర కోశాధికారి దేవకి వాసుదేవ్, బిజెపి ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు అన్నారు. మీరు అధికారంలోకి రావడానికి జర్నలిస్టుల కృషి ఎంతో ఉందని వారిని వారి సేవలను వాడుకొని వదిలివేయటం సమంజసం కాదని పేర్కొన్నారు. న్యాయబద్ధమైన జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులు ఏ కార్యక్రమం చేపట్టిన వారికి సంపూర్ణ మద్దతు ఉంటుందని భరోసా ఇచ్చారు.

సమస్య పరిష్కారమయ్యే వరకు దశల వారి ఉద్యమాలు

టి జే ఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు ఆకుతోట ఆదినారాయణ చిర్రా రవి మూడు దశాబ్దాలుగా జర్నలిస్టులు ఇళ్ల స్థలాల కోసం ఇళ్ల స్థలాల కోసం ఎదురుచూస్తున్నారని, గత ప్రభుత్వం జీవో జారీ చేస్తూ క్యాబినెట్ ఆమోదం పొంది 23 ఎకరాల రెండు కుంటల స్థలాన్ని కేటాయించిందని వాటిని అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర క్యాబినెట్లో ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు ఉండి కూడా ఈ సమస్యను నేటికీ కూడా పరిష్కరించలేకపోవడం బాధాకరం అన్నారు. కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడంలో జర్నలిస్టుల పాత్ర కీలకమైందని అటువంటి జర్నలిస్టులను రోడ్డుపాలు చేయటం ఎంతవరకు సమంజసం అని అన్నారు. ముఖ్యమంత్రి ఖమ్మం జిల్లా చెందిన ముగ్గురు మంత్రులు చొరవ తీసుకొని తక్షణమే ఈ సమస్యను పరిష్కరించాలని లేనిపక్షంలో దశల వారి ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు.

ఇంటి స్థలాల ప్రక్రియ ను వేగవంతం చెయ్యాలి :గడల శ్రీనివాస్

ఇంటి స్థలాల ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేయాలని సొసైటీ స్థలాన్ని జనసేన తెలంగాణ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గడల శ్రీనివాస్, ఖమ్మం నియోజకవర్గ ఇన్చార్జి మిర్యాల రామకృష్ణ ఈ సందర్భంగా అన్నారు, జర్నలిస్టులు చేపట్టే ఏ కార్యక్రమానికైనా తమ పార్టీ పక్షాన సంపూర్ణ మద్దతు ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమానంతరం జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్ కు జర్నలిస్టుల బృందం వినతి పత్రం అందజేశారు.

ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు గోంగూర వెంకటేశ్వర్లు, ప్రముఖ న్యాయవాది తిరుమల రావు,టి జె ఎఫ్ జాతీయ కౌన్సిల్ సభ్యులు వెన్నబోయిన సాంబశివరావు, జిల్లా ఉపాధ్యక్షులు బొల్లం శ్రీనివాస్, ప్రశాంత్ రెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా ప్రధాన కార్యదర్శి శెట్టి రజినీకాంత్, మందుల ఉపేందర్, బిగ్ టీవీ భాస్కర్, ఉదయ్, మందటి వెంకటరమణ, వనం నాగయ్య, కలువకోలను హరీష్ రావు, యలమందల జగదీష్, శర్మ, కె.వి. మోహన్ ,నగర కార్యదర్శి అమరవరపు కోటేశ్వరరావు,ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబు, కోశాధికారి బిక్కీ గోపి, జర్నలిస్టు నేతలు జీవన్ రెడ్డి, ముత్యాల కోటేశ్వరరావు, పానకాల రావు, తిరుపతి రావు, దుబ్బాకుల శ్రీనివాసరావు, తోట గణేష్, బిక్షం, మహిళ ప్రతినిధులు వంగూరి ఈశ్వరి,రోజా, మాధవి, కిరణ్మయి, సాయి, కళ్యాణ్ నరసింహారావు, కూరపాటి నరేష్, యాదగిరి ,లింగయ్య, నాగ శేఖర్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గుత్తా వెంకటేశ్వర్లు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి, తెలంగాణ రక్షణ సేన జిల్లా అధ్యక్షుడు హుస్సేన్, రాష్ట్ర నాయకులు కిషన్ నాయక్, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి బండారి ఐలయ్య,సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి సి వై.పుల్లయ్య, ఆవుల అశోక్, జార్జి రెడ్డి పిడిఎస్ యు జిల్లా కార్యదర్శి సురేష్, ఐసా జిల్లా కార్యదర్శి అశోక్, పీడీఎస్ యు రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటేష్, పీవైఎల్ రాష్ట్ర కార్యదర్శి కోల లక్ష్మీనారాయణ, ఐఎఫ్.టీయు జిల్లా అధ్యక్షుడు గౌని మోహన రావు, పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు

చెరుకు రైతులకు కాకతీయ షుగర్స్ తీపి కబురు

వచ్చే సీజనకు యాజమాన్యం టన్నుకు రూ. 4వేల ధర భరోసా



కల్లూరు, నవంబర్ 16 : ప్రజా జ్యోతి ఖమ్మం జిల్లా కల్లూరు మండలం లో కాకతీయ సిమెంట్ షుగర్ అండ్ ఇండస్ట్రీ లిమిటెడ్ కర్మాగారంలో 2026-27 చెరుకు గానుగ సీజన్ సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ఆ సంస్థ చీఫ్ ఇంజనీర్ వెంకటరత్నం తన సతీమణి యాజమాన్యం కలిసి ఉదయం గంటలకు చెరుకు గడలను గానుగలో వేసి సీజన్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కర్మాగారంలో ప్రత్యేక పూజలు నిర్వహించి నూతనంగా గానుగ సీజన్ విజయవంతంగా సాగాలని ఆకాంక్షించారు. అనంతరం కర్మాగారం జోన్ వివిధ రైతు సంఘాల నాయకులతో కర్మాగారానికి ఉన్న అనుబంధాన్ని చెరుకు సాగులో వారు ఎదుర్కొంటున్న పరిస్థితులను వివరించారు. ఈ సందర్భంగా వైస్ ప్రెసిడెంట్ సిహెచ్ నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో చక్కెర పరిశ్రమ తీవ్ర గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటుందని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రైతుల కర్మాగారానికి సహకరించాలని కోరారు. రైతులు పరిశ్రమ పరస్పర సహకారంతో ముందుకు సాగినప్పుడే ఇరు వర్గాలకు ప్రయోజనం కలుగుతుందని అన్నారు. చక్కెర పరిశ్రమల మొనగాడ ప్రశ్నార్థకంగా మారుతున్న తరుణంలో రైతులకు అందుబాటులో ఉండి వారికి తోడ్పాటు అందించాలని ఉద్దేశంతో యాజమాన్యం భరోసా కల్పించింది. 2027 – 28 సీజనకు బోనస్, ఎఫ్ఆర్ పీ ఇతర ప్రోత్సాహకాలు కలిపి చేరుకు టన్నుకు రూ.4,000 చెల్లించునున్నట్లు తెలియజేశారు. రైతులకు మేలు జరగాలని ప్రధాన ఉద్దేశంతోనే ముందుకు సాగుతున్నామని స్పష్టం చేశారు. చెరుకు రైతులకు కర్మాగారంతో ఉన్న అనుబంధం ఎంతో కీలకమని రైతుల సహకారం సిబ్బంది అంకితభావం పరిశ్రమ అభివృద్ధికి ఎంతో అవసరం అన్నారు. ఈ గానుగ సీజన్లో అందరూ సమిష్టిగా పనిచేసే విజయవంతం చేయాలన్నారు. గానుగ ప్రారంభోత్సవం అనంతరం రైతులకు అల్పాహారం వడ్డించే వారితో రైతులతో మమేకమై అల్పాహారం స్వీకరించారు. రైతులను ప్రోత్సహించే ఉద్దేశంతో సాగుకు అవసరమైన విత్తనాలు మొక్కలను రుణ సదుపాయం పై అందించనున్నట్లు తెలిపింది 4:30 అడుగుల దూరంలో నాటే రైతులకు ఎకరానికి రెండు టన్నులు ఒంటికన్ను ముచ్చలతో నాటే వారికి ఎకరానికి 8 వేల మొక్కలను ఒక్కొక్కటి రూ. 1.65 చొప్పున రుణంగా ఇవ్వనుంది. అలాగే ఎరువులు కలుపు మందులను రసీదుల ఆధారంగా రుణంపై అందించడంతోపాటు మోటార్లు సోలార్ ఫెన్సింగ్ పివిసి పైపుల కోసం ఎకరానికి రూ. 12 వేలు కౌలు రైతులకు 20వేల రుణ సదుపాయం కల్పిస్తామన్నారు. 55 కిలోమీటర్లకు మించి చెరుకు సరఫరా చేసే రైతులకు అదనపు దూరానికి టన్నుకు కిలోమీటర్కు రూ. 4 చొప్పున రవాణా ప్రోత్సాహకం అందిస్తామని. సంక్రాంతి తర్వాత నరికే చెరుకు టన్నుకు 50 రూపాయలు సబ్సిడీని రైతుల ఖాతాలో జమ చేస్తామని ఈ సబ్సిడీ యంత్రాల ద్వారా చేరుకు నరికే విధానానికి వర్తిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ ఎం వై కుమార్ చందన, రామచంద్ర, శ్రీనివాసరావు, రైతులు, కర్మాగార సిబ్బంది పాల్గొన్నారు.

ఎవరు చెప్పినా మేము మారం గాక మారం.., మా స్టైల్ అంతే,

కామేపల్లి నవంబర్ 16 ఎవరు చెప్పినా మేము మారం గాక మారం మా జిల్లా స్థాయి అధికారులు కా., మండల స్థాయి అధికారులు కావచ్చు.... మా స్టైల్ అంతే... అన్న విధంగా తయారయింది కామేపల్లి మండలంలోని కీలక శాఖల అధికారుల వ్యవహారం రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం ప్రజావాణి కార్యక్రమాన్ని మండల స్థాయి అధికారులు అపా హాస్యం చేస్తున్నారు. స్వయంగా జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీచేసిన గైర హాజరైతే వేటు తప్పదని ఎంపీడీవో ధారావత్ సోమ్లాల్ కఠిన హెచ్చరికలు జారీ చేసిన మండలంలోని వివిధ శాఖల అధికారుల తీరులో ఏమాత్రం మార్పు రావడం లేదు సోమవారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ప్రారంభం కావాల్సిన ప్రజావాణి 11 గంటలు దాటిన పలు కీలక శాఖల మండల స్థాయి అధికారులు హాజరు కాలేదు. జాబితాలో పేరున్న బాధ్యతాయుతమైన అధికారులు స్వయంగా హాజరై రిజిస్టర్లో సంతకాలు చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ వాటిని తుంగలో తొక్కారు ఈ సమావేశానికి వివిధ శాఖలకు చెందిన అధికారులు మొత్తం 24 మంది హాజరు కావలసి ఉండగా కేవలం ఎనిమిది మంది అధికారులు మాత్రమే హాజరయ్యారు పలు శాఖల అధికారులు గైరా హాజరు అయ్యారు. అధికారులు గైరహాజరు కావడంతోపాటు నిర్లక్ష్యంగా వ్యవహరించడం పై మండిపడుతున్నారు ప్రధాన శాఖలైన రెవెన్యూ, అగ్రికల్చర్ ,విద్యాశాఖ, అధికారులు ఆలస్యంగా హాజరయ్యారు వైద్య



ఆరోగ్యశాఖ ,పోలీస్ శాఖ ,ఎక్సేంజ్, ఆర్ అండ్ బి, ఐ టి డి ఏ, ఆర్టికల్చర్ ,మత్స్యశాఖ అధికారులు అసలు అడ్రస్సే లేరు. మరికొందరు అధికారులు ఈ సమావేశానికి తీరిక చూసుకొని ఆలస్యంగా హాజరు కావడం తాము గ్రామాల్లో విజిట్ కు వెళ్లామని అందుకే ఆలస్యం అయిందని చెప్పటం కోసమేరుపు ఇప్పుడు వరకు జరిగిన సీఎం ప్రజావాణి కార్యక్రమానికి అందరూ మండల స్థాయి అధికారులు ఒక్కసారి కూడా సమావేశానికి హాజరైన దాఖలాలు లేవు కొన్ని శాఖల అధికారులు వస్తే కొన్ని శాఖల అధికారులు అసలు అడ్రస్ ఏ ఉండటం లేదు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఉన్నంత లక్ష్యం నీరు గారి పోతుంది జిల్లా ఉన్నత అధికారుల హెచ్చరిక అలానే లెక్క చేయని ఈ డుమ్మా అధికారులపై జిల్లా కలెక్టర్ ఎలాంటి చర్యలు తీసుకుంటారు వేచి చూడాలి.

హేసా కంపెనీ ఆధ్వర్యంలో రైతులు, మహిళలకు వ్యవసాయ పంపులపై అవగాహన



రఘునాథపాలెం ప్రజా జ్యోతి పాపటపల్లి గ్రామంలో సోమవారం రైతు వేదికలో హేసా కంపెనీ ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల మహిళలు, రైతులకు వ్యవసాయ పంపులు, కిరణం స్టోర్ల ఏర్పాటుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హేసా కంపెనీ ప్రతినిధి హరీశ్, తెలంగాణ హెడ్ కిరణ్, ఏపీ నుంచి రవి రాంభట్ల పాల్గొని మాట్లాడారు. నాణ్యమైన వ్యవసాయ పంపులను అతి తక్కువ ధరలకు ఆన్లైన్ విధానంలో అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యమన్నారు. ఆసక్తి ఉన్న మహిళలకు కిరణం స్టోర్లు ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పించి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని వివరించారు. కొత్తగూడెం జిల్లా మేనేజర్ శ్యామ్ ఫీల్డ్ ఆఫీసర్స్ ఫణికిరణ్ నరేష్ ఎల్లేష్ సైదాబీ అవగాహన కల్పించారు మహిళలు, రైతులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

వంగూరు గోపి గృహప్రవేశ వేడుకలో పాల్గొన్న మధిర ప్రెస్ క్లబ్ సభ్యులు



మధిర ప్రజా మధిర ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు, నమస్తే తెలంగాణ రిపోర్టర్, శ్రీ సాయి ఫ్లెక్సీ అధినేత వంగూరు గోపి, అజిత దంపతుల నూతన గృహప్రవేశ వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారి పిల్లల నూతన వస్త్రాలంకరణ వేడుకలు కూడా కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో ఆనందోత్సాహాల మధ్య జరిగాయి. ఈ శుభకార్యానికి మధిర ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షులు నాళ్ళ శ్రీనివాసరావు, గౌరవ సలహాదారులు నమస్తే తెలంగాణ బ్రహ్మం, అధ్యక్ష కార్యదర్శులు జీవి అరుణ్, ఉప కోశాధికారి శ్రీధర్, ప్రెస్ క్లబ్ సభ్యులు డి వేణు, క్రిస్టఫర్, సంతోష్, ప్రభాకర్,కోటి మరియు ఈనాడు కేపీ హాజరై వంగూరు గోపి, అజిత దంపతులకు శు భాకాంక్షలు తెలియజేశారు. నూతన గృహంలో సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. పిల్లలను ఆశీర్వదించారు.

ఈనెల 20న అభిషేక కార్యక్రమం

నిర్వహించనున్న బిషప్ డాక్టర్ రెవరెండ్ కే సేనం రాజ్

పాలేరు : ఈనెల 20న అభిషేక కార్యక్రమాలు నిర్వహించినట్లు బిషప్ డాక్టర్ రెవరెండ్ కే సేనం రాజ్ తెలిపారు. బెంగళూరు, బిషప్స్ కాలేజీలో, హైదరాబాద్ కళాశాలలో, డోర్నకల్ బోధకుల కళాశాలలో, థియాలాజికల్ విద్యను అభ్యసించిన క్రైస్తవ మత గురువులకు ఆర్డినేషన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు బిషప్ రెవరెండ్ డాక్టర్ కె సైన్యం రాజ్ వివరించారు. ఇప్పటికే పలు సంఘాల్లో విధులు నిర్వహిస్తున్న గురువులకు 32 మందికి గాను 28 మంది సంపూర్ణ గురువులు గా, 4 గురు సహాయక గురువుగా

రైతు సంఘం జాతీయ మహాసభలకు తరలి వచ్చిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు

సీపీఎం పార్టీ మండల కార్యదర్శి మద్దాల ప్రభాకరరావు

ఎర్రుపాలెం ప్రజా జ్యోతి నల్లగొండ లో ఆదివారం నిర్వహించిన సభ గ్రాండ్ సక్సెస్ అయిందని సిపిఎం పార్టీ ఎర్రుపాలెం మండల కార్యదర్శి మద్దాల ప్రభాకర్ తెలియజేస్తూ ఈ సభకు లక్షలాది మంది ప్రజలు,కార్మికులు, వ్యవసాయ కార్మికులు ప్రత్యేకించి రైతులు తరలి తరలివచ్చారని, ఇందు కోసం సిపిఎం కార్యకర్తలు గత రెండు మూడు నెలలుగా పడుతున్న శ్రమకు ఫలితం దక్కినట్లు అయిందన్నారు.ఎర్రజెండా కవాతులో యువతి,యువకులు పాల్గొని దిక్కులు పిక్కటిల్లే నినాదాలతో నల్లగొండ పురవీధులను హోరెత్తించారు.చూపరులను రెడ్ షర్ట్ కవాతు,ధిసా,లంబాడీల నృత్యం వివిధ సంస్కృత ప్రదర్శనలు ఆకట్టుకున్నాయన్నారు.సభకు ముఖ్యఅతిధిగా హాజరైన జాతీయ నాయకురాలు మాజీ ఎంపీ బృందాకరత్ ఇతర నాయకులు ప్రధానంగా బీజేపీ వ్యవసాయం కార్పొరేట్లకు అనుకూలంగా మారుస్తున్న దానిపై నాయకులు బాణాలు ఎక్కుపెట్టారు . రైతుల రుణమాఫీకి కేంద్రం, రాష్ట్ర లు నిరకరిస్తూ కార్పొరేట్లకు నజరానాలు ప్రకటిస్తూ రైతులను కూలీలుగా మారుస్తు దేశ ప్రజల ఆహార భద్రతకు ప్రమాదం కలిగిస్తున్నారని విమర్శించారు. కేంద్రం రూ.50 వేల కోట్లు కరువు పరిహారాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయకపోతే రైతుల సమస్యలు పరిష్కరించపోతే లక్ష మందితో పాదయాత్ర చేస్తామని రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వానికి డెడ్ లైన్ విధించారన్నారు.నాయకుల ప్రసంగం సిపిఎం విధానాలపై స్పష్టత లేని వారికీ, పార్టీలకు స్పష్టత ఇచ్చిందని ప్రజలందరూ ఐక్యంగా సమస్యలపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు.ఈ బహిరంగ సభకు ఎర్రుపాలెం మండలం నుండి తరలి వెళ్ళుటకు తమ విలువైన సమయాన్ని కేటాయించి, ప్రచురణ, ప్రచారానికి ఉపయోగపడిన మీడియా మిత్రులకు,



ప్రత్యక్షంగా,పరోక్షంగా సహకరించిన అభ్యుదయ వాదులకు, విద్యావంతులకు,ప్రముఖులకు,తరలి వచ్చిన రైతులకు, కార్మికులకు, ప్రజలకు,మహిళలకు ,ప్రతి ఒక్కరికీ మద్దాల ప్రభాకరరావు ప్రత్యేక హృదయపూర్వక ధన్యవాదాలు
తెలియజేశారు.

విద్యార్థులు చెడు వ్యసనాలకుదూరంగా ఉండాలి

లంకా కొండయ్య సేవలు అభినందనీయం

జాతీయ బాలోత్సవం లో.. పుతుంభాక, టీవీ రెడ్డి

మధిర ప్రజా జ్యోతి అతని ప్రచారం ఓ వినూత్నం, అతని లక్ష్యం సమాజహితం సమాజంలో ఎన్నోఏళ్ళుగా ఉన్న సామాజిక మానసిక రుగ్మతలపై తనదైన శైలిలో వీలు దొరికితే చాలు ఎక్కడ జనం వుంటే అక్కడ వాలి పోతాడు... అతనే ప్రముఖ సామాజిక సేవకుడు (మధిర ఆశ మిత్ర)జానపద కళాకారుడు, జాతీయ అవార్డు గ్రహీత లంకా కొండయ్య.

రుగ్మతలపై అవగాహనా నివారణ

ఇటీవల మధిర పట్టణం లో జరిగిన రెండు తెలుగు రాష్ట్రాలైన పరిధిలో నిర్వహించిన జాతీయ స్థాయి బాలోత్సవం లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ తరపున పీహెచ్ సీ హెల్త్ సూపర్ వైజర్ లంకా కొండయ్య కార్యక్రమంనకు హాజరైన విద్యార్థులకు, తల్లి తండ్రులకు గురువులకు, హాజరైన వివిద ప్రేక్షకులకు ప్రపంచాన్నీ పట్టి పిడిస్తున్న హెచ్ ఐ వి /ఎయిడ్స్ మహమ్మారి పై, మత్తు పదార్థాలు నివారణ తదితర విషయాలు గురించి సంపూర్ణముగా అవగాహన పరచినారు. ముందుగా హాజనా ప్రముఖులు చేతులు మీదుగా బాలో త్సవ్ వేదిక మీద ఆవిష్కరణ, ప్రజల అవగాహన నిమిత్తం చేసినారు. అనంతరం కొండయ్య ఆ ప్రాంగణంలో అందరికి హెచ్ఐవి /ఎయిడ్స్ గురించి కరపత్రాలు పంచి పెట్టినారు. రామభక్త సీతయ్య కళా పరిషత్ అధ్యక్ష, కార్యదర్సిలు ప్రముఖ రంగస్థల కళాకారులు సమాఖ్య అధ్యక్షులు పుతుంభాక కృష్ణ ప్రసాద్ రావు, మధిర బాబ్ల, ప్రముఖ రెడ్డి సంఘ





నాయకులు టీవీ రెడ్డి, కవి రాష్ట్ర కో ఆఫ్ రేటివ్ విశ్రాంతి ఉద్యోగి యల్లగందులు రాధకృష్ణ, కళాకారులు పెద్దలు జంగాల గురువులు, ప్రముఖ ఉపాధ్యాయులు మేడేపల్లి శ్రీనివాసరావు, ప్రముఖ సీనియర్ పాత్రికేయ మిత్రులు ఆంధ్ర ప్రభ స్టాఫ్ రిపోర్టర్ పాగి బాలస్వామి, ప్రముఖ పౌరాణిక జానపద కళాకారుడు మహంత బాబు, సిపిఐ నాయకులు, ప్రజా నాట్య మండలి కళాకారులు పంగా శేషగిరి రావు, మొదలగు వారి చేతులు మీదుగా ఆవిష్కరణ చేసినారు. అనంతరం పెద్దలు మాట్లాడుతూ లంకా కొండయ్య నిరంతరం జన సమూహశీలో ఏదో ఒక సామజిక సమస్యపై అవగాహన పరిచి జన చైతన్య చేయటం ఎంతో అభినందననియం అని వారు అన్నారు.

బదావత్ లాలి కుటుంబానికి ఆర్థిక సాయం,



కామేపల్లి ప్రజా జ్యోతి నవంబర్ 16 కామేపల్లి మండలంలోని సాతానిగూడెం గ్రామానికి చెందిన బాధావత్ లాలి అనారోగ్యంతో మృతి చెందడంతో ఆమె కుటుంబానికి స్థానిక సర్పంచ్ అయినా బి . రెడ్యానాయక్ మరియు కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు సత్తి వీరబాబు యాదవ్ ఆధ్వర్యంలో 5000 రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేసి భరోసా కల్పించారు లాలి దినకర్మలకు వారు ఈ సాయని అందజేశారు. వారి కుటుంబానికి భరోసా కల్పించారు లాలి దినకర్మల సందర్భంగా ఆమె కుటుంబాన్ని పరామర్శించిన ఆ ఇద్దరు ప్రధాన నేతలు కష్టకాలంలో పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసానిచ్చారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పద్మ, వార్డు సభ్య రాలు లక్ష్మి, సీనియర్ నాయకులు బద్రు ఫీల్డ్ అసిస్టెంట్ వెంకట నరసయ్య భాషా నాయక్ రమేష్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని వారికి అండగా నిలిచారు.

పాలిటెక్నిక్ కళాశాలలను విద్యాశాఖ పరిధిలోనే కొనసాగించటం హర్షణీయం

తెలంగాణ పాలిటెక్నిక్ వర్క్ షాప్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు లింగాల నాగేశ్వరరావు



మధిర ప్రజా జ్యోతి తెలంగాణ ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జీవో నెంబర్ 157 ఫలితంగా తెలంగాణ రాష్ట్రంలోని పాలిటెక్నిక్ కళాశాల లను విద్యాశాఖ పరిధిలోని కొనసాగిస్తూ సంబంధిత జీవోను సవరిస్తూ జీవో నెంబర్ 157 విడుదల చేయడం పట్ల తెలంగాణ పాలిటెక్నిక్ వర్క్ షాప్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు లింగాల నాగేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలిటెక్నిక్ కళాశాల ప్రయోజనాలను ప్రయోజనాలను వాటి అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం అభినందనయం విద్యాశాఖ పరిధిలోనే పాలిటెక్నిక్ కళాశాలను కొనసాగించడం వల్ల కళాశాల పరిపాలన విద్యావ్యవస్థ ముందుకు సాగేందుకు దోహదపడుతుందని ఆయన అన్నారు ఈ నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కి తెలంగాణ పాలిటెక్నిక్ వర్క్ షాప్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు లింగాల నాగేశ్వరరావు, ఖమ్మం జిల్లా అధ్యక్షులు ఏ హరికుమార్, వజ్రాల. శ్రీనివాసచారి, జూపూడి సంజీవరావు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు

వేంసూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో సమస్యలు వెల్లువ
డుమ్మా కొట్టిన సర్పంచ్లు





వేంసూరు,నవంబర్16 ప్రజాజ్యోతి సోమవారం నియోజకవర్గ పరిధిలోని వేంసూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోని సమావేశపు మందిరంలో ఎంపీఓ భూక్యా రంజిత్ కుమార్ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం వాడి వేడిగా సాగింది.ఉదయం 10:30 కు ప్రారంభం కావాల్సిన సమావేశం సుమారు గంట లేటుగా ప్రారంభం చేశారు.దీంతో మహిళా సర్పంచులు అసహనానికి గురి అయినట్లు వినికిడి.సమా వేశానికి కొందరు సర్పంచులు,కొన్ని శాఖలాధికారులు డుమ్మా కొట్టిన వైనం అగుపించింది.సమావేశం జరుగుతుండగానే కొందరు సర్పంచులు,కొన్ని శాఖలాధికారులు లేచిపోయిన దుస్థితి అగుపించింది.ఇకపోతే వివరాలలోకి వెళ్తే గత సమావేశాలలో తీసుకున్న నిర్ణయాలు అమలు చేయడంలో,చెప్పిన సమస్యలు పరిష్కారం చేయడంలో చర్యలు శూన్యంగా ఉన్నాయని అధికారులను ముక్త కంఠంతో ప్రశ్నించారు.

అలాంటప్పుడు సమావేశాలకు ప్రజాప్రతినిధులు ఎలా హాజరవుతారు సమయం వృథా తప్ప ఉపయోగం ఏమిటి అని దుయ్యబట్టారు.వేంసూరు పశువైద్యశాలకు రెగ్యులర్ వైద్యులు లేకపోవడంతో పాడి రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని సభ దృష్టికి తెచ్చారు.అనంతరం చౌడవరం తండా సర్పంచ్ బర్మావత్ రాము మాట్లాడుతూ మా తండా కు గ్రామ మహిళా సమాఖ్య భవనం(వి.ఓ.) ప్రభుత్వం మంజూరు చేసి నెలలు గడిచినా స్థలం గుర్తించినా నిర్మాణం కు అడ్డుపడుతున్న వారిపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు.తక్షణమే నిర్మాణానికి అధికారుల పూర్తి సహకారం అందించండి మహాప్రభో అని బిగ్గరగా అధికారులను కోరారు. పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ శాఖ అధికారులు ఫోన్ కూడా లిఫ్ట్ చేయడం లేదని లోపాలను సరి చేసుకోవాలని,వి.బి.జి.రామ్.జీ పథకం సమస్య పరిష్కారం అధికారులు చేసుకోవాలని జయలక్ష్మీపురం గ్రామ సర్పంచ్ గడిపర్తి శ్రీనివాసరావు సూచించారు.తహశీల్దార్ జె.మాణిక్ రావు మాట్లాడుతూ అర్హులైన వారు నూతన రేషన్ కార్డులు కోసం దరఖాస్తు చేసుకున్న వెంటనే మంజూరు కోసం డి.ఎస్.ఓ.కు పశీపుతున్నామని స్పష్టం చేశారు.చౌడవరం తండాలో నిర్మించాల్సిన వి.ఓ.భవనం స్థలం ప్రభుత్వ భూమిగా గుర్తించి అనుమతి ఎప్పుడో ఇచ్చామని అక్కడ ఎదురవుతున్న సమస్యపై పోలీసు శాఖకు గతంలో పిర్యాదు కూడా చేశామని దాని పరిష్కారం పోలీసు శాఖ వద్ద పెండింగ్ లో ఉందని తెలిపారు.త్వరలోనే పరిష్కారం కోసం సమిష్టిగా కృషి చేద్దామని అన్నారు.సర్వసభ్య సభ జరుగుతుంటే కొన్ని శాఖల నుండి హాజరైన ప్రతినిధులు సెల్ ఫోన్ లలో చాట్ చేయడం,కొందరు తమ శాఖ రిపోర్ట్ చెప్పి బయటకు వెళ్ళిపోవడం క్రమశిక్షణా రాహిత్యంగా అగుపించాయి.కార్యదర్శులు అయితే సర్వ సభ్య సమావేశం జరుగుతుంటే కొందరు పక్క గదులలో కూర్చున్న వైనాలు అగుపించాయి.మైనారిటీ శాఖ నుండి హాజరు లేదు.ఈ కార్యక్రమంలో: మండల విద్యాశాఖాధికారి చల్లంచర్ల వెంకటేశ్వరరావు,విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ గొడ్డటి అంకారావు,ఐకెపి ఏపీఏం సుబ్బారావు,ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సిడిపిఓ బి.సత్యవతి, సూపర్ వైజర్ ఇజ్జిగాని గంగాజలం,కందుకూరు పశు వైద్య అధికారిని సఫియా,సాంఘిక సంక్షేమ,వెనుకబడిన తరగతుల అధికారులు,ఆర్టీసీ సిబ్బంది,పంచాయతీ రాజ్ ఇంజనీర్ పూర్ణ,ఏపీఓ విజయ్, సర్పంచులు పొట్లపులశ్రీదేవిభాను ప్రకాశ్, ఎర్రా రమేష్,అర్వపల్లి నరసింహారావు,కనమాల ఆంధ్రయ్య,కాట్ జమలారావు,పర్వా ప్రసాద్,కుంచపర్తి తదితర గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌పై విద్యార్థినుల ఫిర్యాదు
కల్లూరు కళాశాలలో కలకలం
సబ్ కలెక్టర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు



కల్లూరు, నవంబర్ 16 : ప్రజా జ్యోతి కల్లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ వ్యవహారశైలిపై విద్యార్థినులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్ తమ పట్ల అనుచితంగా మాట్లాడుతున్నారని, ప్రవర్తిస్తున్నారని ఆరోపిస్తూ కల్లూరు సబ్ కలెక్టర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు సోమవారం చేశారు. ఈ ఘటన కళాశాల వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. తమకు ఎదురవుతున్న ఇబ్బందులను ఫిర్యాదులో వివరించిన విద్యార్థినులు, ఇందుకు సంబంధించి కొన్ని ఆడియో రికార్డులు కూడా తమ వద్ద ఉన్నాయని పేర్కొన్నారు.. ఈ వ్యవహారాన్ని ఉన్నతాధికారులు తీవ్రంగా పరిగణించి తక్షణమే విచారణ చేపట్టాలని విద్యార్థులు కోరారు. ఈ సందర్భంగా విద్యార్థినులు పలు డిమాండ్లను అధికారుల ముందుంచారు. ఫిర్యాదుపై ఎలాంటి పక్షపాతం లేకుండా సమగ్ర విచారణ జరిపించాలని, ఫిర్యాదు చేసిన విద్యార్థినుల వ్యక్తిగత వివరాలను గోప్యంగా ఉంచాలని విజ్ఞప్తి చేశారు. విచారణ సమయంలో బాధిత విద్యార్థినులపై ఎలాంటి బెదిరింపులు, ఒత్తిళ్లు లేకుండా తగిన రక్షణ కల్పించాలని కోరారు. విచారణ పూర్తయ్యే వరకు అవసరమైన భద్రతా చర్యలు తీసుకోవాలని, ఆరోపణలు నిర్ధారణ అయితే సంబంధిత వ్యక్తిపై చట్టప్రకారం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అలాగే విచారణలో తీసుకున్న చర్యల వివరాలను తమకు తెలియజేయాలని ఫిర్యాదులో విజ్ఞప్తి చేశారు. విద్యార్థినులు నేరుగా ఉన్నతాధికారులను ఆశ్రయించి ఫిర్యాదు చేయడం స్థానికంగా చర్చనీయాంశమైంది. ఈ వ్యవహారంపై అధికారులు స్పందించి సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని, విద్యార్థినుల భద్రతకు భరోసా కల్పించాలని తల్లిదండ్రులు, స్థానికులు కోరుతున్నారు.

శివనామంతో పులకించిన కూసుమంచి.. భక్తులతో కిటకిట
పలు జిల్లాల నుంచి పోటెత్తిన భక్తులు.. వైభవంగా ప్రత్యేక పూజలు, మహాహారతి

పాలేరు ఆర్.సీ నవంబర్ 16 ప్రజాజ్యోతి పవిత్ర కార్తీక మాసం తొలి సోమవారం సందర్భంగా ఖమ్మం జిల్లా కూసుమంచి మండల కేంద్రంలోని ప్రసిద్ధ శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజాము నుంచే కూసుమంచితో పాటు చుట్టుపక్కల మండలాలు, ఖమ్మం, సూర్యాపేట తదితర జిల్లాల నుంచి భక్తులు కుటుంబ సమేతంగా పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు భక్తుల రద్దీతో సందడిగా మారగా, శివనామస్మరణతో మారుమోగాయి. తొలి సోమవారం కావడంతో స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు.మహిళలు ఆలయ ప్రాంగణంలో, ఉసిరి చెట్టు కింద కార్తీక దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీపాల కాంతులతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. స్వామివారికి రుద్రాభిషేకం, ప్రత్యేక అలంకరణ, అర్చనలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, పంచామృతాలతో అభిషేకాలు జరిపి బిల్వదళాలు, పుష్పాలతో స్వామివారిని అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకుడు శేషగిరి శర్మ ఆధ్వర్యంలో అభిరామ్ శర్మ, ఆంజనేయ స్వామి ఆలయ అర్చకుడు రంగబాలాజీ పూజా





కార్యక్రమాలు నిర్వహించారు.శివ, అయ్యప్ప దీక్షా స్వాముల భజనలు భక్తులను ఆకట్టుకున్నాయి. హరహర మహాదేవ, శంభో శంకర నామస్మరణతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. భక్తులు భజనల్లో పాల్గొంటూ స్వామివారిని కీర్తించారు. రోజంతా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు కొనసాగాయి.రాత్రి 8 గంటలకు నిర్వహించిన మహాహారతిలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. మంగళవాయిద్యాలు, శంఖనాదాల మధ్య మహాహారతి వైభవంగా సాగింది. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈఓ కాముని శ్రీకాంత్, జూనియర్ అసిస్టెంట్ రాందాస్, ఆత్మకూరి వాచ్ మెన్ వీరబాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానికి వచ్చే భక్తులు సౌకర్యవంతంగా స్వామివారిని దర్శించుకునేలా అవసరమైన చర్యలు చేపట్టారు. కార్తీక మాసం తొలి సోమవారం సందర్భంగా కూసుమంచి శివాలయంలో నెలకొన్న భక్తి వాతావరణం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

కూసుమంచి ప్రభుత్వ జూనియర్ కళాశాలకుమహర్దశ

రూ.5.50 కోట్లతో ఆధునిక భవనం.

తుది దశకు చేరిన నిర్మాణ పనులు

విద్యార్థులకు మెరుగైన విద్యా వసతులు కల్పించడమే లక్ష్యం.

ప్రారంభోత్సవంపై ఆసక్తి

పాలేరు ఆర్.సీ నవంబర్16 ప్రజా జ్యోతి ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయడంలో భాగంగా కూసుమంచి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు నూతన భవన నిర్మాణం చేపట్టారు. సుమారు రూ.5.50 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న ఈ భవనం పనులు ప్రస్తుతం దాదాపు పూర్తికావస్తున్నాయి. విశాలమైన ప్రాంగణం, మూడు అంతస్తులతో నిర్మితమవుతున్న ఈ భవనం అందుబాటులోకి వస్తే ప్రభుత్వ కళాశాలలో చదువుకునే విద్యార్థులకు మెరుగైన వసతులు కలగనున్నాయి.

మంత్రి చొరవతో నిర్మాణం

శిలాఫలకంపై ఉన్న వివరాల ప్రకారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని విద్యా మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ ద్వారా ఈ నిర్మాణ పనులు చేపట్టారు. రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా 2025 జూలై 31న శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఖమ్మం జిల్లా కూసుమంచి మండల కేంద్రంలో ఈ కళాశాల భవనం నిర్మాణం తుది దశకు చేరుకోవడం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తెలంగాణ రాష్ట్రప్రభుత్వంపై ప్రజలకు ఎంతో నమ్మకం ఏర్పడుతున్నట్లు ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు



ప్రారంభోత్సవం ఎప్పుడో?

నిర్మాణ పనులు చివరి దశకు చేరుకుంటున్న నేపథ్యంలో భవనాన్ని ఎప్పుడు ప్రారంభిస్తారన్న ఆసక్తి విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానిక ప్రజల్లో నెలకొంది. భవన నిర్మాణం పూర్తయిన వెంటనే అవసరమైన ఫర్నిచర్, ప్రయోగశాలలు, తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ తదితర సదుపాయాలు కల్పించి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.ప్రభుత్వ విద్యాసంస్థలకు పక్కా భవనాలు నిర్మించడం ఎంత ముఖ్యమో, వాటిలో అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం కూడా అంతే ముఖ్యమని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.రూ.5.50 కోట్ల ప్రజాధనంతో నిర్మితమవుతున్న ఈ భవనం కేవలం కాంక్రీట్ నిర్మాణంగా మిగిలిపోకుండా, గ్రామీణ విద్యార్థుల ఉన్నత విద్యకు బలమైన పునాదిగా నిలవాలని స్థానికులు ఆకాంక్షిస్తున్నారు.

విద్యార్థులకు విజయపథంపై అవగాహన

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి.. ఉన్నత లక్ష్యాలను సాధించాలి.





కల్లూరు నవంబర్ 16 : ప్రజా జ్యోతి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసేలా మోటివేషనల్ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని వక్తలు అన్నారు. తల్లిదండ్రుల ఆశయాలను నెరవేరుస్తూ, చెడు వ్యసనాలకు దూరంగా ఉండి క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని జీడీబీ పల్లి (బోడిమెల్లి) గ్రామానికి చెందిన కీ.శే. సంఘం శంభయ్య--తిరుపతమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారులు సంఘం మల్లయ్య, మోటార్ వెహికల్స్ ఇన్స్పెక్టర్ భద్రాచలం, టీజీవో సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు లయన్ సంఘం వెంకట పుల్లయ్య, కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో సోమవారం కల్లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

కళాశాల ప్రిన్సిపాల్ వేముల శేఖర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి సత్తుపల్లి రూరల్ సీఐ పి. సర్వయ్య ముఖ్య అతిథిగా, ప్రముఖ సాఫ్ట్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్ శిక్షకుడు జవ్వాది వెంకటేశ్వరబాబు ముఖ్య వక్తగా హాజరయ్యారు. విద్యార్థులు గంజాయి, మాదకద్రవ్యాలు, ఇతర చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సీఐ సర్వయ్య సూచించారు. మహిళలు, బాలికల పట్ల గౌరవంగా వ్యవహరించాలని, వేధింపులకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇలాంటి కేసులు భవిష్యత్తులో ఉద్యోగాలు, పాస్‌పోర్టు పొందే సమయంలో ఇబ్బందులకు దారితీయవచ్చని తెలిపారు. వెంకటేశ్వరబాబు మాట్లాడుతూ సమయపాలన, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పట్టుదలతో లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలని సూచించారు. కౌమార దశలో ఎదురయ్యే శారీరక, మానసిక మార్పులు, చెడు సాహచర్యాల వల్ల కలిగే నష్టాలను వివరించారు. విజయానికి అడ్డదారులు లేవని, నిరంతర కృషి, మంచి అలవాట్లే విజయానికి పునాదులని పేర్కొన్నారు. నిర్వాహకుడు సంఘం వెంకట పుల్లయ్య మాట్లాడుతూ తన తల్లి తిరుపతమ్మ వర్ధంతి సందర్భంగా, తాను చదువుకున్న కళాశాల విద్యార్థులకు ఉపయోగపడాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తల్లిదండ్రులను గౌరవిస్తూ వారి ఆశయాలను నెరవేర్చాలని విద్యార్థులకు సూచించారు. ఎస్ఐ జె. నాగరాజు కూడా విద్యార్థులు చట్టాలను గౌరవిస్తూ చెడు సాహచర్యాలకు దూరంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో సమాజ సేవకులు అమీరుద్దీన్, మాడిశెట్టి వెంకటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, నిర్వాహకుల కుటుంబ సభ్యులు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అల్లం నారాయణ కుటుంబాన్ని పరామర్శించిన మండలం మాజీ ఎంపీపీ జూకూరి గోపాల్ రావు



పాలేరు ఆర్.సీ నవంబర్16 ప్రజా జ్యోతి పెద్దపల్లి జిల్లా అంతని మండలం గాజుల పల్లె గ్రామానికి చెందిన తెలంగాణ రాష్ట్ర ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ తల్లి కామ్రేడ్ అల్లం బుచ్చమ్మ దశదిన కార్యక్రమానికి కూసుమంచి మండల మాజీ ఎంపీపీ జూకురి గోపాలరావుహాజరై బుచ్చమ్మ చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గట్టు సింగారం గ్రామ మాజీ సర్పంచ్ చాట్ల పరుశురాం, రాజారావు, టీచర్ డాక్టర్ దేవరగట్ల, లక్ష్మయ్య, అల్లం నారాయణ సోదరులు అల్లం వీరయ్య, అల్లం రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

భారత్ సమ్మిట్ వివాదం.. డీజీపీ సీవీ ఆనంద్‌ను కలిసిన బీజేపీ నేతలు

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్‌ను బీజేపీ నేతలు సోమవారం కలిశారు. డీజీపీని కలిసి భారత్ సమ్మిట్‌లో దేశానికి వ్యతిరేకంగా మాట్లాడిన వారిపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ నేతలు మాట్లాడారు. భారత్ సమ్మిట్‌లో విదేశీయులు భారత రాజకీయాలపై చేసిన వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ నిర్వహించింది భారత్ సమ్మిట్ కాదని.. యాంటీ భారత్ సమ్మిట్ సంచలన ఆరోపణలు చేశారు. ఈనీతీవతిణనివతీబ ంఇబి కింద ఈ కేసులు నమోదు చేయాలని డీజీపీని కోరారు.

న్యాయపోరాటం చేస్తాం..: సమ్మతి భారత్ ఫౌండేషన్, ప్రోగ్రెసివ్ ఇంటర్నేషనల్‌పై చర్యలు తీసుకోవాలని బీజేపీ నేతలు విజ్ఞప్తి చేశారు. ఈ సదస్సు నిర్వహణలో తెలంగాణ ప్రభుత్వ పాత్రపై కూడా విచారణ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి రాహుల్ గాంధీ ప్రధాన ప్రేరకుడని అన్నారు. విదేశీయుల పర్యటన ఉద్దేశంపై అనుమానాలు ఉన్నాయని చెప్పుకొచ్చారు. భారత్ వ్యతిరేక కార్యకలాపాల సమాచారం చివరి నిమిషంలో కేంద్ర ప్రభుత్వానికి తెలిసిందని అన్నారు. ఈ క్రమంలోనే 115 మందికి విమాన ప్రయాణాలను రద్దు చేశారని తెలిపారు. వారిపై చర్యలు తీసుకోకపోతే న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు.

భారతదేశంపై అనుచిత వ్యాఖ్యలు చేశారు..: భారతదేశం గడ్డమీద మనల్ని ప్రపంచం ముందు అవమానించడానికి ప్రయత్నించారని.. ఇది చాలా అభ్యంతకరమని బీజేపీ నేతలు ధ్వజమెత్తారు. సెక్షన్ 22 కింద వారిపై కేసు పెట్టాలని డీజీపీని కోరారు. సమృద్ధి ఫారెన్ ఫౌండేషన్‌పై కేసు పెట్టాలని డిమాండ్ చేశారు. నేరం చేయడానికి విదేశీ నేతలను ప్రోత్సహించారని, అలాంటి ఆర్గనైజర్స్‌పై కూడా చర్యలు తీసుకోవాలని కోరారు. న్యాయ సలహాలు తీసుకొని వారిపై చర్యలు తీసుకుంటామని డీజీపీ చెప్పారని అన్నారు. ఇటలీలో ప్రతిపక్ష పార్టీలో ఉన్న నాలుగు పార్టీల వ్యక్తులు భారతదేశంపై అనుచిత వ్యాఖ్యలు చేశారని ధ్వజమెత్తారు. డీజీపీ నిర్ణయం తర్వాత బీజేపీ తదుపరి ప్రణాళికలు ప్రకటిస్తామని స్పష్టం చేశారు. సదస్సు పేరుతో దేశంలోకి విదేశీ నేతలను తీసుకువచ్చి ఇలా ఎందుకు మాట్లాడించారని బీజేపీ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.